


# విజయభాను




విశాఖపట్నం, శనివారం 31-08-2019 VIJAYABHANU DAILY ★ VISAKHAPATNAM సంపుటి : 42 సంచిక : 306 పేజీలు : 8 వెల : 1 రూపాయి

## రాష్ట్రంలో అన్ని ప్రాంతాల్లో
# ఇంటింటికీ తాగునీరు

- మూడు దశల్లో వాటర్ గ్రిడ్‌ను పూర్తి చేయండి
- తాగునీటిపై సమీక్షలో సీఎం జగన్ ఆదేశం



అమరావతి: రాష్ట్రంలో అన్ని ప్రాంతాల్లో ప్రజలకు ఇంటింటికీ తాగునీరు అందించేలా సత్వర చర్యలు తీసుకోవాలని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. వాటర్ గ్రిడ్ పథకం పనులను మూడు దశల్లో సత్వరమే పూర్తి చేయాలన్నారు. తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో తాగునీటి సరఫరాపై అధికారులతో సీఎం సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షకు పంచాయతీరాజ్ ,గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, సీనియర్ అధికారులు, ఉభయ గోదావరి జిల్లాల కలెక్టర్లు, అధికారులు హాజరయ్యారు. వాటర్ గ్రిడ్

తరువాయి 2లో..

## దేశానికి అవినీతి నుంచి
# విముక్తి కల్పిస్తా

- స్వచ్ఛభారత్‌ను నిర్మిస్తాం
- పరస్పరం గౌరవించుకోవాలి
- ఇంటిపేరుతో విజయం రాదు
- అవినీతికి పాల్పడడం ఆమోదయోగ్యం కాదు



దిల్లీ: ప్రజాజీవితంలో వ్యక్తులు, సంస్థల మధ్య భేదాభిప్రాయాలు ఉన్నప్పటికీ ఒకరి అభిప్రాయాలను మరొకరు గౌరవించుకోవాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. కోచిలో మళయాల మనోరమ మీడియా కాన్‌క్లేవ్‌ను ఉద్దేశించి ప్రధాని దిల్లీ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రసంగించారు. ఎన్ని విభేదాలు ఉన్నప్పటికీ చర్చలకు అవకాశం ఉండాలని తెలిపారు. ఐదేళ్ల క్రితం వరకు ప్రజల ఆకాంక్షలకు విలువ లేకుండా ఉండేదని కాంగ్రెస్‌పై పరోక్ష విమర్శలు గుప్పించారు. విజయం అనేది ఇంటిపేరుతో రాదని.. వ్యక్తిగత సామర్థ్యం ఉండాలన్నారు.

ఇప్పుడు దేశంలో వ్యక్తి ఎవరైనా సరే, ఎంతటి హోదాలో ఉన్నా సరే అవినీతికి పాల్పడం ఆమోదయోగ్యం కాదు. అది ఎప్పటికీ ఒక అవకాశం కాకూడదు. పోటీతత్వమే మన విధానం. నేటి భారతంలో కొంతమంది గొంతుక మాత్రమే వినిపించడం కాదు.. దేశంలోని 130కోట్ల మంది గళం వినిపించే అవకాశం ఉంది. మీడియాకు సంబంధించినంతవరకూ ప్రతి భారతీయుడి అభిప్రాయాలను వినడం ఎంతో ముఖ్యం. ప్రస్తుతం దేశంలో ప్రతి ఒక్కరూ దేశానికి ఎంతో కొంత సేవ చేయాలనే అభిప్రాయపడుతున్నారు. కానీ ఐదేళ్ల క్రితం ఇలా లేదు. అప్పట్లో ప్రజలు మనం ఏమైనా చేయగలమా అని అనుకునేవారు. అవినీతిని రూపుమాపగలమా అని పరస్పరం అభిప్రాయపడేవారు. కానీ నేడు.. చేయగలమా

తరువాయి 2లో..

## మత్స్యసంపద ఉత్పాదనలో ప్రపంచంలోనే
# భారత్‌ది రెండో స్థానం



- అనారోగ్యానికి ఆస్కారమివ్వని, ఇబ్బంది కలిగించని ఆహారం మత్స్యసంపద
- హెచ్ఐసీసీలో ఆక్వా సదస్సు ప్రారంభం
- ప్రారంభించిన ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు

హైదరాబాద్: మాదాపూర్ హెచ్ఐసీసీ ప్రాంగణంలో ఆక్వా అక్వేరియా ఇండియా-2019 ప్రదర్శన ప్రారంభమైంది. ఈ ప్రదర్శనను ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు ప్రారంభించారు. సముద్ర ఉత్పత్తుల ఎగుమతుల అభివృద్ధి సంస్థ, కేంద్ర వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో

తరువాయి 2లో..

## మరో 10 బ్యాంకుల విలీనంతో
# 4 అతిపెద్ద బ్యాంకుల ఏర్పాటు

### కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్



న్యూఢిల్లీ: గతంలో ఎస్ బీఐ, బ్యాంక్ ఆఫ్ బరోడాలో చిన్న చిన్న బ్యాంకులను విలీనం చేసిన కేంద్రప్రభుత్వం ఇప్పుడు మరో 10 బ్యాంకులను విలీనం చేసి..4 అతిపెద్ద బ్యాంకులను ఏర్పాటు చేయనున్నట్లు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా

తరువాయి 2లో..

## ఏపీ హైకోర్టు
# సీజేగా జస్టిస్ మహేశ్వరి

### సిఫారసు చేసిన సుప్రీంకోర్టు కొలీజియం

దిల్లీ: ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ జేకే మహేశ్వరిని సుప్రీంకోర్టు కొలీజియం సిఫారసు చేసింది. ప్రస్తుతం ఆయన మధ్యప్రదేశ్ హైకోర్టు సీనియర్ న్యాయమూర్తిగా ఉన్నారు. మధ్యప్రదేశ్‌లో సివిల్, క్రిమినల్ న్యాయవాదిగా ఆయన పనిచేశారు. 2005లో మధ్యప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తిగా నియమితులయ్యారు. 2008లో పూర్తిస్థాయి న్యాయమూర్తిగా పదవీ బాధ్యతలు స్వీకరించారు. గతంలో జస్టిస్ విక్రంనాథ్ పేరును ఏపీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా కొలీజియం సిఫారసు చేయగా.. కేంద్రం ఆయన పేరును వెనక్కి తిప్పి పంపించింది. తాజాగా జస్టిస్ మహేశ్వరి పేరును సుప్రీంకోర్టు కొలీజియం సిఫారసు చేసింది. ఆయనకు రాజ్యాంగపరమైన పలు కేసులు వాదించిన అనుభవం ఉంది.

# రాజధాని ఇక్కడొద్దని ఎప్పుడూ చెప్పలేదు

- అవసరమైతే మోదీ, అమిత్‌షాను కలుస్తా
- జనసేన అధినేత పవన్ కల్యాణ్



అమరావతి: జనసేన అధినేత పవన్ కల్యాణ్ రాజధాని ప్రాంతంలో పర్యటించారు. నిడమర్రు, కూరగల్లులో పర్యటించిన ఆయన కొండవీటి వాగు వద్ద వంతెన పనుల్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ.. రాజధాని అంశంపై మంత్రులు బాధ్యతగా మాట్లాడాలని సూచించారు. మంత్రుల ప్రకటనలతో తీవ్ర గందరగోళం నెలకొందన్నారు. రాజధానిలో అవినీతి జరిగితే విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రస్తుత సమస్యలపైనా ప్రధాని నరేంద్ర మోదీ, హోంమంత్రి అమిత్‌షాలను కలిసే ఆలోచన ఉందన్నారు. సమయం దొరికితే వాళ్లను కలిసి రాష్ట్రంలోని పరిస్థితుల్ని వివరిస్తానన్నారు. రాజధాని మారుస్తామని

తరువాయి 2లో..



## రేణుకా చౌదరికి
# నాన్‌బెయిలబుల్ వారెంట్

ఖమ్మం: కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ ఎంపీ రేణుకా చౌదరికి నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ అయింది. ఖమ్మం జిల్లా రెండో అదనపు ఫస్ట్ క్లాస్ కోర్టు వారెంట్‌ను జారీ చేసింది. తన భర్తకు 2014 ఎన్నికల్లో ఎమ్మెల్యే టికెట్ ఇప్పిస్తానంటూ రేణుక మోసగించారని కళావతి బాయి అనే మహిళ ఖానాపురం హవేలీ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు రేణుకా చౌదరిపై సెక్షన్ 420, 417 కింద కేసు నమోదు చేశారు. ఈ కేసు విచారణలో భాగంగా న్యాయస్థానం రేణుకకు నోటీసులు జారీ చేసింది. ఆ నోటీసులను

తరువాయి 2లో..

# పీఎఫ్‌పై 8.65 శాతం వడ్డీ!

### త్వరలో ప్రకటన విడుదల చేయనున్న కార్మిక శాఖ

దిల్లీ: 2018-19 ఆర్థిక సంవత్సరానికిగానూ ఉద్యోగ భవిష్యనిధి డిపాజిట్లపై వడ్డీని 8.65 శాతంగా నిర్ణయిస్తూ కార్మిక మంత్రిత్వ శాఖ ప్రకటన వెలువ రిస్తుందని ఆ శాఖా మంత్రి సంతోష్ గాంగ్వార్ అన్నారు. శుక్ర వారం దిల్లీలో జరి గిన ప్రైవేటు సెక్యూ రిటీ గార్డుల సమా వేశంలో పాల్గొన్న అనం తరం ఆయన మీడియాతో మాట్లాడారు. పీఎఫ్‌పై 8.65శాతం వడ్డీ ఇచ్చేందుకు కేంద్ర ఆర్థిక మంత్రిత్వశాఖ ఏమాత్రం విభేదించటం లేదన్నారు. త్వరలోనే దీనిపై నోటిఫికేషన్ విడుదలవుతుందని పేర్కొన్నారు. దీంతో ఆరుకోట్ల మంది పీఎఫ్ చందాదారులకు లబ్ధి చేకూరనుందని తెలిపారు.

ఫిబ్రవరిలో సంతోష్ గాంగ్వార్ నేతృత్వంలోని ఈపీఎఫ్‌వో కేంద్ర ధర్మకర్తల మండలి, ఈ మేరకు వడ్డీ పెంచేందుకు సభ్యుల ఆమోదం తీసుకుంది.

ఈ ప్రతిపాదనను ఆర్థిక మంత్రిత్వ శాఖకు బదిలీ చేసింది. ఆర్థిక సేవల విభాగం(డీఎఫ్ఎస్) ఏప్రిల్‌లో 2018-19 సంవత్సరానికి పీఎఫ్‌పై 8.65 శాతం వడ్డీ ఇచ్చేందుకు సుముఖత వ్యక్తం చేసింది.

ఇప్పుడు ఆదాయ పన్ను విభాగం, కార్మిక శాఖ సంయుక్తంగా నోటిఫై చేయడమే మిగిలి ఉంది. ప్రకటన విడుదల తర్వాతే ఉద్యో గుల భవిష్య నిధి సంస్థ చందాదారుల ఖాతాలో వడ్డీని జమ చేయనుంది.

ఉద్యోగుల భవిష్యనిధి సంస్థ లెక్కల ప్రకారం.. 8.65 శాతం వడ్డీ ఇస్తే, రూ.151.67 కోట్ల మిగులు ధనం. 8.70 శాతం ఇస్తే, 158 కోట్ల ద్రవ్యలోటు సంస్థ భరించాల్సి ఉంటుంది. అందుకే 2018-19కి గాను 8.65 శాతం వడ్డీని నిర్ణయించినట్లు సమాచారం. 2017-18 సంవత్సరానికి పీఎఫ్ వడ్డీరేటును ఐదేళ్ల కనిష్ఠానికి తగ్గించిన విషయం తెలిసిందే. ప్రస్తుతం 8.55శాతం వడ్డీనే ఇస్తున్నారు.

# ఆ వార్తలన్నీ అవాస్తవాలు

### — ఐటీ శాఖ స్పష్టీకరణ —




దిల్లీ: ఆదాయపు రిటర్నులు దాఖలుకు గడువు పెంచు తున్నట్టు వచ్చిన వార్తల్ని ఐటీ శాఖ ఖండించింది. అవన్నీ తప్పుడు వార్తలేనని స్పష్టం చేస్తూ ట్వీట్ చేసింది. 2018-19 సంవత్సరానికి సంబం ధించి ఆదాయపు పన్ను రిటర్నులు సమర్పణకు గడువు నేటి వరకూ ఉందని స్పష్టం చేసింది.

కేంద్ర ప్రభుత్వం ఐటీ రిటర్నుల దాఖలు చేసేందుకు మరింత గడువు ఇచ్చిందని.. రిటర్నులు దాఖలు చేసేందుకు మరో నెల రోజులు (సెప్టెంబర్ 30) వరకు పొడిగిస్తూ కేంద్ర ప్రత్యక్ష పన్నుల బోర్డు (సీబీడీటీ) ఉత్తర్వులు జారీ చేసినట్టు సామాజిక మాధ్యమాల్లో వార్తలు చక్కర్లు కొట్టాయి. దీంతో అప్రమత్తమైన ఐటీ శాఖ అవన్నీ తప్పుడు వార్తలేనని కొట్టిపారేసింది.

సాధారణంగా గత ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఆదాయపు పన్ను రిటర్నులు సమర్పించడానికి చివరి తేదీ జులై 31. అయితే రిటర్నులు దాఖలు చేసేటప్పుడు సమస్యలు తలెత్తుతున్నాయని, గడువు తేదీని పెంచాలని పలు వర్గాల నుంచి అభ్యర్థనలు రావడంతో రిటర్నుల దాఖలుకు ఆగస్టు 31 వరకు సమయమిచ్చిన విషయం తెలిసిందే.



# దోచుకున్న వాళ్లే ధర్నాకు దిగారు

అమరావతి: ఇసుక కొరతపై టీడీపీ నేతలు ధర్నా చేయటంపై స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి తానేటి వనిత ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం ఆమె మీడియాతో మాట్లాడుతూ.. ఇసుకను దోచుకున్న టీడీపీ నేతలే ఇప్పుడు ధర్నాకు దిగుతుంటే జనం నవ్వుకుంటున్నారని ఆమె విమర్శించారు. గత ఐదేళ్లలో టీడీపీ నేతలు ఇసుకను అమ్ముకుని కోట్లు సంపాదించారని ఆరోపించారు. వారి ఇసుక దోపిడీ భరించలేకనే ప్రజలు ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పారని పేర్కొన్నారు.

ఇసుక దోపిడీని అడ్డుకున్న వనజాక్షిపై దాడికి దిగిన టీడీపీ నేత, దెందులూరు మాజీ ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ ఇసుక కోసం

తరువాయి 2లో..



# వాణిజ్య ప్రకటనలకు నిలయంగా పోలీస్‌స్టేషన్ సముదాయం




అనకాపల్లి : సహేతుకమైన ప్రకటనలకు వ్యతిరేకం కాదు ... ఏకంగా ప్రభుత్వ కార్యాలయాల పేర్లు మార్చేసే ప్రకటనలు మాత్రం న్యాయసమ్మతం కాదు. పట్టణ నడిబొడ్డున మెయిన్‌రోడ్డులోని 'అనకాపల్లి పోలీస్ స్టేషన్ల సముదాయం' విషయంలో అదే జరిగింది. ఈ సముదాయంలో మహిళ, పట్టణ, ట్రాఫిక్ పోలీస్ స్టేషన్లున్నాయి. దశాబ్దాల చరిత్ర కల్గి విశేష సేవలందిస్తూ ఒకప్పుడు 'అనకాపల్లి పోలీస్ స్టేషన్ సముదాయం'గా ప్రసిద్ధి చెందిన ఈ సముదాయాన్ని ఏకంగా 'నేత్రాలయ ఐ క్లినిక్ అండ్ ఆప్టికల్స్ అనకాపల్లి పోలీస్ స్టేషన్ సముదాయం'గా పేరు మార్చేశారు. అందరికీ కనిపించేలా భారీ బోర్డు కూడా ఏర్పాటు చేసేశారు. బాధ్యులెవరైనప్పటికీ చరిత్ర కల్గిన అనకాపల్లి పోలీస్ స్టేషన్ సముదాయం పేరును మార్చడం సబబు కాదు, ప్రభుత్వ నిబంధనలకు భిన్నమంటూ ఇటీవల అనకాపల్లి డీఎస్పీ కార్యాలయంలో జరిగిన స్పందనలో రాష్ట్ర వినియోగదారులు, పౌరసరఫరాలు, ఆహార మంత్రిత్వ శాఖ విజిలెన్స్ కమిటీ సభ్యుడు, సమాచార హక్కు ఉద్యమకర్త కాండ్రేగుల వెంకటరమణ డీఎస్పీకు వినతిపత్రం అందజేశారు. ఆ వివరాలను శుక్రవారం ఆయన పత్రికలకు విడుదల చేశారు. తక్షణం ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు చేసిన బోర్డును తొలగించాలని ఆయన డిమాండ్ చేశారు. పోలీస్ స్టేషన్ల సముదాయం ముఖద్వారమంతా వాణిజ్య ప్రకటనలతో కప్పేసింది. కొంతమంది కక్షిదారులు అయోమయానికి గురవుతున్నారన్నారు. పోలీస్ స్టేషన్ సముదాయంలో అనధికారికంగా వాణిజ్యప్రకటనలు కళ్లెదుటే కనిపిస్తున్నా జీవీఎంసీ అనకాపల్లి జోన్ అధికారులు పట్టించుకోకపోవడం విచారకరమన్నారు.

కేంద్ర ప్రభుత్వ ఉత్తర్వులు, సుప్రీం కోర్టు తీర్పు నేపథ్యంలో బుగ్గ కారు (ఎర్ర లైటు ధరించిన ప్రభుత్వ వాహనం), పోలీస్ ఎస్కార్ట్, ముందస్తు హెచ్చరిక సైరన్ (హారన్) ఎవరెవరికి వర్తిస్తుందో వెల్లడించు ఆదేశాలను బేఖాతరు చేసి కొంతమంది ప్రజా ప్రతినిధులకు పోలీస్ శాఖ అత్యుత్సాహంతో కల్పిస్తున్న సౌకర్యాలపై విచారణ చేయాలని ఆయన కోరారు. అనకాపల్లి డిఎస్పీ కార్యాలయం పరిధిలోని 13 పోలీస్ స్టేషన్లలలో కూడా సమాచార హక్కు (ఆర్టీఐ) చట్టం-2005 వేగవంతంగా అమలుకు చర్యలు తీసుకోవాలని, ఆర్టీఐ చట్టం సెక్షన్ 4 (1) (బి) తాజా పరచాలని, పీఐవో, ఏపీఐవో, అప్పీలేట్ అధికారి పేర్లు, మొబైల్ నెంబర్లు కల్గిన ఆర్టీఐ సెక్షన్ 5 (1), 5 (2), 19 (1) బోర్డు ఏర్పాటు చేయాలని, రాష్ట్ర ప్రభుత్వం జీవో ఎమ్మెస్ నెం. 420 (13-9-2005, ప్రధాన పరిపాలన శాఖ)ను అనుసరించి జారీ చేయు 'అన్ని' రకాల ఉత్తర్వులు, సర్క్యులర్లు, యు.ఓ నోట్లు, మెమోలు, జీ.ఓలు / డీ.ఓ. లేఖలు తెలుగులో విడుదల చేయాలని కాండ్రేగుల వెంకటరమణ విజ్ఞప్తి చేశారు. పోలీస్ శాఖ సిటిజన్ ఛార్టర్ ప్రకారం నిర్దేశిత గడువులోగా చర్యలు తీసుకోవాలన్నారు. కాగా వినతిపత్రంపై సెప్టెంబర్ 1వ తేదీలోగా చర్యలు తీసుకుంటామని లిఖితపూర్వకంగా డీఎస్పీ కార్యాలయం హామీ ఇచ్చింది.

# యశోదకు మెరుగైన చికిత్స అందించండి

- కెజిహెచ్ వైద్యులకు జనసేన నాయకురాలు సూచన
- ఉత్తర నియోజకవర్గ జనసేన నాయకురాలు పసుపులేటి



విశాఖ సిటీ : ఇటీవల అనకాపల్లిలో జరిగిన సంఘటనలో తీవ్రంగా కత్తిగాయాలకు గురైన యశోద భారతి చికిత్స నిమిత్తమై విశాఖ కెజిహెచ్‌లో జాయిన్ అయింది. ప్రియుడి దాష్టీకానికి అందరూ కోపోద్రిక్తులైనారు. యశోదను పరామర్శించేందుకు విశాఖ ఉత్తర నియోజకవర్గ జనసేన పార్టీ నాయకురాలు పసుపులేటి ఉషాకిరణ్, యలమంచిలి జనసేన పార్టీ నాయకుడు సుందరపు విజయకుమార్ శుక్రవారం కెజిహెచ్‌కు వెళ్లి పరామర్శించారు. ఆమె త్వరలో కోలుకోవాలని, ఆందుకు ఆమెకు మెరుగైన వైద్య సేవలందించాలని వైద్యులను కోరారు. ఆమె బంధువులను పలకరించి దాడికి గల ముఖ్య కారణాలను తెలుసుకున్నారు. మహిళా రక్షణకు ఎన్నో చట్టాలు చేసినా దేశ వ్యాప్తంగా ఎక్కడో అక్కడ ఇలాంటి సంఘటనలు చేసుకోవడం దురదృష్టకరమని అన్నారు. బాధితురాలిని పరామర్శించిన వారిలో జనసేన నాయకులు ప్రమీల, వంశీ, సుధ, లక్ష్మి, నాగమణి, జయ, మురళి తదితరులు పాల్గొన్నారు.

### ఎన్‌టిపిసి సింహాద్రి శకుంతల్ హాల్‌లో

# ప్రాంతీయ స్థాయి మేధా ప్రతియోగిత పోటీ



విశాఖపట్నం : ఎన్‌టిపిసి సింహాద్రి శకుంతల్ హాల్‌లో ప్రాంతీయ స్థాయి మేధా ప్రతియోగిత పోటీని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దక్షిణ ప్రాంత ప్రాజెక్టులు, రామగుండం, సింహాద్రి, కుడిగి, ఎన్‌టిఇసిఎల్, ఎస్‌ఆర్‌హెచ్‌క్యూ, కాయంకులం నుంచి నాలుగు విభాగాల్లోని 24 జట్లు పాల్గొన్నాయి. ఎన్‌టిపిసి లిమిటెడ్ ప్రతి సంవత్సరం మేధా ప్రతియోగితను నిర్వహిస్తుంది, ఉద్యోగులు మరియు వారి పిల్లలలో నేర్చుకునే మరియు పోటీతత్వ సంస్కృతిని నాలుగు విభాగాలలో (జూనియర్, మిడిల్, పాఠశాల పిల్లలలో సీనియర్ మరియు ఉద్యోగులు మరియు వారి జీవిత భాగస్వాములు) మూడు స్థాయిలలో, యూనిట్ స్థాయి, ప్రాంతీయ స్థాయిలో మరియు జాతీయ స్థాయి. ప్రతి విభాగంలో అగ్రశ్రేణి బృందం న్యూ డెలిహిలో నిర్వహించబోయే జాతీయ స్థాయి వద్ద దక్షిణ ప్రాంతానికి ప్రాతినిధ్యం వహిస్తుంది.

**ప్రాంతీయ స్థాయి పోటీ విజేతలు.**
**జూనియర్ స్థాయిలో పాఠశాల పిల్లలు- కుడిగి**
**మధ్య స్థాయి పాఠశాల పిల్లలు - సింహాద్రి**
**సీనియర్ స్థాయిలో పాఠశాల పిల్లలు - సింహాద్రి**
**ఉద్యోగుల స్థాయి- ఎన్‌టిఇసిఎల్ - వల్లూర్‌గా నిలిచారు.** ఈకార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వి సుదర్శన్ బాబు, సిజిఎం పాల్గొన్నారు.

# గ్రామ సచివాలయ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

## మండల కేంద్రాల నుండి దూరంగా ఉన్న పరీక్షా కేంద్రాలకు ఉచిత రవాణా సౌకర్యం

## ముందు రోజు రాత్రి పరీక్షా కేంద్రానికి చేరుకునే వారికి ఉచిత బస కల్పించుటకు ఏర్పాట్లు

## శ్రీకాకుళం జిల్లా కలెక్టర్ జె నివాస్

శ్రీకాకుళం: జిల్లాలో గ్రామ సచివాలయ పరీక్షల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేసామని శ్రీకాకుళం జిల్లా కలెక్టర్ జె నివాస్ అన్నారు. గ్రామ సచివాలయ పరీక్షల ఏర్పాట్లపై శుక్ర వారం ఏర్పాటు చేసిన మీడియా ప్రతినిధుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. జిల్లాలో 25 మండలాల్లో 73 రూట్ లుగా విభజించి 306 కేంద్రాలలో పరీక్షలు నిర్వహించుటకు ఏర్పాటు చేసామన్నారు. ఇందుకుగాను 3,377 మంది ఇన్విజిలేటర్లు, 1,014 మంది హాల్ సూపరింటిండెంట్లు, 336 మంది చీఫ్ సూపరింటిండెంట్లు, 53 మంది అదనపు చీఫ్ సూపరింటిండెంట్లు, 325 మంది డిపార్టుమెంటల్ అధికారులు, 307 మంది వెన్యూ ప్రత్యేక అధికారులు, 73 మంది రూట్ అధికారులు, 35 ఫ్లైయింగు స్క్వాడ్ లను ఏర్పాటు చేసామని ఆయన వివరించారు. 1,14,734 మంది అభ్యర్థులు పరీక్షలు రాస్తున్నారని అందులో 70,698 మంది పురుషులు, 44,036 మంది మహిళలు, 332 మంది అంధత్వం కలిగిన దివ్యాంగులు, 1398 మంది ఆర్థోపెడికల్ దివ్యాంగులు ఉన్నారని చెప్పారు. 135 మంది దివ్యాంగులు సహాయకులు అవసమరని తెలిపారని చెప్పారు.

పరీక్షలకు హాజరు అయ్యే అభ్యర్థులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా అన్ని చర్యలు చేపట్టామని ఆయన వివరించారు. 31వ తేదీ సాయంత్రం 15 బస్సులను దూర ప్రాంతాలకు వెళ్ళే అభ్యర్థుల సౌలభ్యార్థం నడుపుతున్నామని చెప్పారు. రాజాం నుండి ఇచ్ఛాపురం వెళ్ళుటకు 31 సాయంత్రం 3 బస్సులను 5, 6 గంటల సమయంలో నడుపుతున్నామని, రాజాం నుండి కవిటి వెళ్ళుటకు 1 బస్సు, రేగిడి ఆమదాలవలస నుండి పలాస వెళ్ళుటకు 4 బస్సులను సాయంత్రం 5, 7 గంటలకు నడుపుతున్నామని, వంగర నుండి శ్రీకాకుళం వచ్చుటకు 5 బస్సులను సాయంత్రం 5, 6, 7 గంటలకు బయలుదేరుతాయని చెప్పారు. పరీక్షలకు హాజరు అగుటకు 1వ తేదీ ఉదయం 213 బస్సులను ఏర్పాటు చేస్తున్నామని, మండల కేంద్రాల నుండి లోపలకు ఉన్న కేంద్రాలకు చేరుకొనుటకు 17 మండల కేంద్రాల నుండి 118 బస్సులను ఉచితంగా ఏర్పాటు చేసామని వివరించారు.

ప్రతి కేంద్రం వద్ద భద్రత, వైద్యశిబిరం ఏర్పాటు చేసామని కలెక్టర్ చెప్పారు. అభ్యర్థులను పోలీసులు పూర్తిగా చెకింగు చేసిన అనంతరం పరీక్ష హాల్ లోకి అనుమతించడం జరుగుతుందని అన్నారు.

***31న పరీక్షా కేంద్రాలుగల పాఠశాలలు, కళాశాలలకు స్థానిక సెలవు***

1వ తేదీన జరిగే పరీక్షలకు సామగ్రి సరఫరాను 31వ తేదీన సరఫరా చేయడం




జరుగుతుందని జిల్లా కలెక్టర్ అన్నారు. పరీక్షల ఏర్పాట్లను చేయుటకుగాను 31వ తేదీని పరీక్షలు జరిగే పాఠశాలలు, కళాశాలలకు స్థానిక సెలవును మంజూరు చేసామని చెప్పారు. పరీక్షలు జరిగే 3, 4, 6, 7 తేదీలలో స్థానిక సెలవు మంజూరు చేయుటకు అనుమతి ఇస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని పేర్కొన్నారు. 1,8 తేదీలు ఆదివారం కావడంతో ప్రభుత్వ సెలవు దినాలు ఉంటాయని చెప్పారు.

***కలెక్టర్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ హెల్ప్ డెస్క్***

పరీక్షల నిర్వహణకు సంబంధించి కంట్రోల్ రూమ్‌ను జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసామని జిల్లా కలెక్టర్ నివాస్ చెప్పారు. కంట్రోల్ రూమ్ ల్యాండ్ లైన్ ఫోన్ నంబరు 08942 240557 కు ఫోన్ చేసి వివరాలు అందించవచ్చని తెలిపారు. ఉదయం 7 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు సీనియర్ సహాయకులు ఏ.రవికృష్ణ (ఫోన్ 9866017687), జి.మల్లేశ్వరమ్మ (9505217989)., మధ్యాహ్నం 2 గంటల నుండి రాత్రి 10 గంటల వరకు సీనియర్ సహాయకులు జి.ఎస్.కిషోర్ కుమార్ (9949058951), టైపిస్టు ఐ.శ్రీనివాస రావు (9177058105) పనిచేస్తారని ఆయన తెలిపారు.

మీడియా ప్రతినిధుల సమావేశంలో జాయింట్ కలెక్టర్ డా.కె. శ్రీనివాసులు, జాయింట్ కలెక్టర్-2 పి.రజనీకాంతా రావు, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి జి.చక్రధర రావు, రెవిన్యూ డివిజనల్ అధికారి ఎం.వి.రమణ, ఆర్.టి.సి. రీజనల్ మేనేజరు ఎ. అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

మొదటి పేజీ తరువాయి

# దేశానికి అవినీతి నుంచి విముక్తి కల్పిస్తా

అన్న పరిస్థితి నుంచి మనం చేయగలం అనే స్థితికి చేరుకున్నాం అని మోదీ అన్నారు. నువ్వు పెద్ద కుటుంబం నుంచి వచ్చావా లేదా పెద్ద నగరాలు, పెద్ద విశ్వవిద్యాలయాల్లో చదువుకున్నావా అనే దానిపై ఆధారపడి విజయం సిద్ధించదు. వ్యక్తిగత సామర్థ్యం, సాధించాలనే సంకల్పం, కష్టపడే తత్వంతోనే అన్ని సాధ్యమవుతాయి అని ప్రధాని చెప్పుకొచ్చారు. దేశానికి అవినీతి నుంచి విముక్తి కల్పిస్తామని, స్వచ్ఛభారత్‌ను నిర్మిస్తామని ప్రధాని ఈ సందర్భంగా ధీమా వ్యక్తం చేశారు. సుపరిపాలనను ప్రజా ఉద్యమంగా మారుస్తామన్నారు.

***దేశంలో 12,500 ఆయుష్ కేంద్రాలు***

దేశంలో భారీ సంఖ్యలో ఆయుష్ కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్టు ప్రధాని నరేంద్ర మోదీ వెల్లడించారు. దేశవ్యాప్తంగా మొత్తం 12,500 ఆయుష్ కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్టు ప్రకటించిన ప్రధాని.. శుక్రవారమే 10 ఆయుష్ కేంద్రాలను ప్రారంభించనున్నట్టు తెలిపారు. అలాగే, ఈ ఏడాదిలో దేశంలో 4,000 కేంద్రాలను ఏర్పాటు చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నట్టు వివరించారు. శుక్రవారం ఆయన ఆయుష్ మంత్రిత్వశాఖ ఏర్పాటు చేసిన యోగా అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మోదీ మాట్లాడుతూ.. ఒకే దేశం ఒకే పన్ను, ఒకే దేశం ఒకే మొబిలిటీ కార్డు తరహాలోనే ఆయుష్ గ్రిడ్‌ను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని నొక్కి చెప్పారు. అలాగే, దేశంలో 1.5 లక్షల ఆరోగ్య, సంరక్షణా కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. సంప్రదాయ వైద్య రంగమైన ఆయుష్‌కి సాంకేతికతను జోడించి కొత్త పుంతలు తొక్కిస్తామని వెల్లడించారు. అనేకమంది నిపుణులు ఈ రంగంలోకి వచ్చి సేవలందించేలా అవసరమైన చర్యలు తీసుకుంటామని ప్రధాని తెలిపారు.

# మత్స్యసంపద ఉత్పాదనలో ప్రపంచంలోనే

## భారత్‌ది రెండో స్థానం

మూడు రోజుల పాటు ఈ ప్రదర్శన జరగనుంది. ఈ సదస్సులో భారత్ సహా ఆసియా దేశాల నుంచి ప్రముఖ మత్స్య, వ్యాపార, పరిశోధన సంస్థల ఆధ్వర్యంలో సుమారు 200 స్టాళ్లు ఏర్పాటు చేశారు. తెలంగాణ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్, ఏపీ మత్స్యశాఖ మంత్రి మోపిదేవి వెంకటరమణ, తెరాస ఎంపీలు డాక్టర్ రంజిత్‌రెడ్డి, బండ ప్రకాశ్ తదితరులు ఈ సదస్సుకు హాజరయ్యారు.

ఈ సందర్భంగా ఉప రాష్ట్రపతి వెంకయ్య మాట్లాడుతూ మత్స్యసంపద ఉత్పాదనలో ప్రపంచంలోనే భారత్ రెండో స్థానంలో ఉండటం గర్వకారణమని చెప్పారు. బియ్యం, గోధుమల్లో ఉండే పోషకాలు తక్కువన్నారు. అనారోగ్యానికి ఆస్కారమివ్వని, ఇబ్బంది కలిగించని ఆహారం మత్స్యసంపద అని చెప్పారు. ముఖ్యంగా చేపలు తింటే ఆరోగ్యంగా ఉండటంతో పాటు కొలెస్ట్రాల్, అజీర్ణం తదితర సమస్యలేమీ ఉండవన్నారు. రుతువులు, ప్రాంతాలను బట్టి మన పెద్దవారు మనకి ఆహారపు అలవాట్లు నేర్పించారని.. ప్రపంచంలోని ఏ దేశంలోనూ ఆహారానికి ఇన్ని అవకాశాల్లేవన్నారు. తెలంగాణ మంత్రి తలసాని మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మత్స్యశాఖకు అధిక ప్రాధాన్యం ఇచ్చిందని చెప్పారు. బడ్జెట్‌లో మత్స్య రంగం అభివృద్ధికి పెద్ద ఎత్తున నిధులు కేటాయించినట్లు తెలిపారు. ఏపీ మంత్రి మోపిదేవి వెంకటరమణ మాట్లాడుతూ రాష్ట్రంలో సముద్ర సంపద పెంపొందించేందుకు ఎంపెడా సహకరించాలని కోరారు. ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహించాలని.. ఆ దిశగా ప్రయత్నాలు చేయాలన్నారు

# రాష్ట్రంలో అన్ని ప్రాంతాల్లో ఇంటింటికీ తాగునీరు

పథకాన్ని మొదటి దశలో భాగంగా శ్రీకాకుళం, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, ప్రకాశం జిల్లాల్లో పరిశుభ్రమైన తాగునీటి వసతి కల్పించాలని సీఎం ఆదేశించారు. శ్రీకాకుళం జిల్లాలోని ఉద్దానం తాగునీటి ప్రాజెక్టును ఆ జిల్లా అంతటికీ వర్తింపజేయాలని సూచించారు. రెండోదశలో విజయనగరం, విశాఖతో పాటు రాయలసీమలోని నాలుగు జిల్లాల్లో శుభ్రమైన తాగునీరు అందించాలని.. మూడో దశలో కృష్ణా, గుంటూరు, నెల్లూరు జిల్లాల్లో తాగునీరు ఇవ్వాలని జగన్ ఆదేశించారు. నీటిని తీసుకున్న చోటే శుద్ధిచేసి అక్కడ నుంచి పంపిణీ చేయాలని సమావేశంలో ప్రాథమిక నిర్ణయించారు. దీనిపై నిశిత అధ్యయనం చేసి, ప్రణాళిక ఖరారు చేయాలని సీఎం ఆదేశించారు. ప్రస్తుతం ఉన్న తాగునీటి చెరువులు, సమ్మర్ స్టోరేజీ ట్యాంకులను పరిగణనలోకి తీసుకోవాలన్నారు. వాటిలో తాగునీరు నింపిన తర్వాత కలుషితం కాకుండా ఎలాంటి చర్యలు తీసుకోవాలన్న దానిపై ఆలోచన చేయాలని సీఎం దిశానిర్దేశం చేశారు. కిడ్నీ బాధిత ప్రాంతాల్లో ట్రీట్ మెంట్‌ప్లాంట్ నుంచి నేరుగా ఇళ్లకే తాగునీటిని పంపిణీచేయాలని సీఎం ఆదేశించారు.

# మరో 10 బ్యాంకుల విలీనంతో 4 అతిపెద్ద బ్యాంకుల ఏర్పాటు

సీతారామన్ ప్రకటించారు. పీఎన్‌బీ, ఓబీసీ, యునైటెడ్ బ్యాంకులు విలీనం కానున్నాయని తెలిపారు. ఈ 3 బ్యాంకుల కలయికతో రెండో అతిపెద్ద ప్రభుత్వ రంగ బ్యాంకు ఏర్పడుతుందని నిర్మలాసీతారామన్ మీడియా సమావేశంలో చెప్పారు. ఈ బ్యాంకు రూ.17.95 లక్షల కోట్లతో ఆర్థిక కార్యకలాపాలు నిర్వహిస్తుందని తెలిపారు.

ఆంధ్రాబ్యాంకు, కార్పొరేషన్ బ్యాంకు, యూబీఐ ఒకే బ్యాంకుగా ఏర్పడనున్నాయని నిర్మలా సీతారామన్ తెలిపారు. సిండికేట్ బ్యాంకులో కెనరా బ్యాంకు విలీనం కానున్నట్లు చెప్పారు. అలహాబాద్ బ్యాంకులో ఇండియన్ బ్యాంకు విలీనం అవుతుందని.. వీటి కలయిక ద్వారా ఐదో అతిపెద్ద బ్యాంకుగా మారుతుందని పేర్కొన్నారు. తాజా ప్రకటనతో దేశవ్యాప్తంగా ప్రభుత్వ రంగ బ్యాంకుల సంఖ్య 27 నుంచి 12కు తగ్గనున్నట్లు తెలిపారు. విలీనాల తర్వాత దేశంలో అతిపెద్ద బ్యాంకుగా ఎస్ బీ ఐ, రెండో అతిపెద్ద బ్యాంకుగా పీఎన్ బీ అవతరించనున్నాయని తెలిపారు.

# రాజధాని ఇక్కడొద్దని ఎప్పుడూ చెప్పలేదు

లీకులివ్వడం సరికాదన్నారు. రాజధాని భూసేకరణను మాత్రమే తాను అప్పట్లో వ్యతిరేకించానని పవన్ గుర్తుచేశారు.

***గందరగోళపరిస్తే బలమైన నిర్ణయాలు తీసుకుంటాం***

మంత్రి బొత్స అంటున్నట్టుగా ఇక్కడ రాజధాని వద్దని తానెప్పుడూ చెప్పలేదన్నారు. అన్ని ప్రాంతాలను అభివృద్ధి చేస్తే ఎవరూ వద్దనరన్నారు. మంత్రులు ఏపీ ప్రభుత్వంగా నిలబడాలి తప్ప వైకాపాగా కాదన్నారు. ప్రభుత్వ పరంగా వాళ్లు ఆలోచిస్తే నిర్ణయాలు వేరుగా ఉండేవన్నారు. అందరి రాజధానిగా చేయాలనే సంకల్పంతో ప్రభుత్వం ఆలోచించాలన్నారు. గత ప్రభుత్వం చేసిన తప్పుల్ని సరిదిద్దుతుందని ఆకాంక్షించారు. ఇప్పటికే రాష్ట్ర విభజనతో నష్టపోయామని.. మళ్లీ ఇలాంటి గందరగోళమైన నిర్ణయాలతో నష్టంచేయాలనుకుంటే బలమైన నిర్ణయాలు తీసుకుంటామని పవన్ స్పష్టంచేశారు.

# రేణుకా చౌదరికి నాన్‌బెయిలబుల్ వారెంట్

తీసుకోకపోవడం, విచారణకు హాజరుకాకపోవడంతో కోర్టు నాన్‌బెయిల్‌బుల్ వారెంట్ జారీ చేసింది.

# దోచుకున్న వాళ్లే ధర్నాకు దిగారు

అబద్ధమని తేల్చి చెప్పారు. ఇటీవల వరదలు పోటెత్తినందున ఇసుక తవ్వకం సాధ్యం కాలేదని, సెప్టెంబర్ 5 నుంచి పూర్తి పారదర్శకంగా ఇసుకను సరఫరా చేస్తామని ఆమె స్పష్టం చేశారు.

మాట్లాడితే జనం నవ్వుకుంటున్నారన్నారు. ఇసుక ఉచితంగా ఇస్తామని చెప్పిన టీడీపీ నేతలు ఏ రోజయినా ఉచితంగా ఇసుకను సరఫరా చేశారా అని మంత్రి సూటిగా ప్రశ్నించారు. కొత్త ఇసుక పాలసీ వస్తుందని టీడీపీ నేతలు డ్రామాలు చేస్తున్నారని విమర్శించారు. సిమెంట్ కంపెనీల కోసం ఇసుక కొరత సృష్టించారన్నది అబద్ధం అని టీడీపీ నేతల విమర్శలను తిప్పికొట్టారు. సిమెంట్ కంపెనీల కోసం ఇసుక కొరత సృష్టించారన్నది

# పదేళ్లలో రైల్వే ప్రాజెక్టులకు రూ.50లక్షల కోట్లు

## రైల్వే శాఖ సహాయ మంత్రి సురేష్ అంగడి వెల్లడి

తిరుపతి: రానున్న పదేళ్లలో దేశవ్యాప్తంగా రైల్వే ప్రాజెక్ట్‌లకు రూ.50 లక్షల కోట్లు కేటాయించనున్నట్లు రైల్వే శాఖ సహాయ మంత్రి సురేష్ అంగడి వెల్లడించారు. తిరుమల శ్రీవారి దర్శనం కోసం వచ్చిన ఆయన తిరుపతి రైల్వే స్టేషన్‌ను శుక్రవారం సందర్శించారు. తిరుపతి స్మార్ట్ రైల్వే ప్రాజెక్ట్ గురించి అధికారులతో చర్చించారు. గుంతకల్ డీఆర్‌ఎం అలోక్ తివారీ, తిరుపతి నగరపాలక సంస్థ కమిషనర్ పీఎస్ గిరీషా జరుగుతున్న అభివృద్ధి పనుల గురించి కేంద్ర మంత్రికి వివరించారు. నూతనంగా నిర్మిస్తున్న రైల్వే ప్లాట్‌ఫారాలను, వాటి నిర్మాణ తీరును కేంద్రమంత్రి పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా ప్రఖ్యాతి గాంచిన తిరుపతి రైల్వే స్టేషన్‌ను అన్ని రకాలుగా అభివృద్ధి చేస్తామన్నారు. భూమికి సంబంధించిన రాష్ట్ర ప్రభుత్వానికి, రైల్వే శాఖకు మధ్య కొన్ని సాంకేతిక సమస్యలు తలెత్తాయని, దానిపై సీఎస్‌తో చర్చించి ఓ స్పష్టతకు వస్తామన్నారు. దేశ వ్యాప్తంగా రైల్వే ప్రాజెక్టులపై పెద్దమొత్తం పెట్టుబడులు పెట్టడం ద్వారా.. రాష్ట్రాల మధ్య కనెక్టివిటీ పెంచుతామన్నారు.



జివిఎంసి నగర పరిధిలో పర్యటిస్తున్న విఎంఆర్‌డిఎ చైర్మన్ ద్రోణంరాజు శ్రీనివాస్‌తోపాటు పాల్గొన్న జివిఎంసి అధికారులు మరియు జివిఎంసి జోన్ 3-టిఎల్‌ఎఫ్ అధ్యక్షురాలు మరియు 24వ వార్డు వైఎస్‌ఆర్‌సీపీ నాయకురాలు బెహరా వెంకటరత్నం, వార్డు అధ్యక్షుడు సన్యాసిరావు, కనక మహాలక్ష్మి గుడి చైర్మన్ జెర్రిపోతుల ప్రసాద్, గర్భపు బుజ్జి, రామోజు పెదబాబు, వార్డు ఆర్‌పిలు, ఎస్‌ఎల్‌ఎఫ్ ప్రెసిడెంట్లు తదితరులు ఉన్నారు.

# జివిపి ఎంఎల్‌బిటి పాఠశాలలో మట్టి గణపతుల తయారీ



విశాఖ సిటీ పర్యావరణ హితాన్ని కాంక్షిస్తూ బీచ్‌రోడ్డులోని జివిపి ఎంఎల్‌బిటి పాఠశాలలో మృణ్మయ గణపతులను తయారు చేశారు. విద్యార్థులు తాము పూజించే గణపతి విగ్రహాలను స్వయంగా తయారు చేసారు. పర్యావరణానికి మేలు చేసే ఒండ్రు మట్టితో వీటిని విద్యార్థులు తయారు చేశారు. పాఠశాల ప్రిన్సిపాల్ కె.మధుర వాణి మాట్లాడుతూ ప్రతీ సంవత్సరం విద్యార్థుల్లో పర్యావరణ అవగాహన కల్పించే విధంగా ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నామన్నారు. విద్యార్థులకు పర్యావరణ స్పృహను పెంపొందిస్తూ వారిని భవిష్యత్ వారసులుగా నిలపడం జరుగుతుందన్నారు. చిన్నారులు మట్టితో వినాయక ప్రతిమలు చేసి, వాటిని అకులు, పుష్పాలతో సుందరంగా అలంకరించారన్నారు. విద్యార్థుల్లో సృజనాత్మక శక్తిని, కళా నైపుణ్యాన్ని వెలికితీయడానికి, పెంపొందించడానికి ఇటువంటి కార్యక్రమం ఉపకరిస్తుందన్నారు. కార్యక్రమంలో వందలాది మంది విద్యార్థులు పాల్గొని తొలి పూజలు అందుకునే గణనాధుని విగ్రహాలను తయారు చేశారు. విద్యార్థులు తాము తయారు చేసిన విగ్రహాలు వినాయక చవితి రోజున తమ ఇంటిలో పూజిస్తామని చెప్పారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ వేదుల శ్రీరామ మూర్తి, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.



## ఆచార్య రామమోహన రావును అభినందించిన వీసీ ప్రసాద రెడ్డి

### ఉన్నత విద్యకు బలోపేతం చేసే దిశగా కృషిచేయాలి



ఆంధ్రవిశ్వవిద్యాలయం : ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యామడంలి ఉపాధ్యక్షునిగా ఏయూ కామర్స్‌మేం జ్‌మెంట్ విభాగం సీనియర్ ఆచార్యులు, ఆర్ట్స్,కామర్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య కె.రామ మోహన రావు నియమితు లయ్యారు. ఆచార్య రామమోహన రావు నియామకం పట్ల వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. తన కార్యాలయంలో ఆచార్య రామ మోహన రావుకు పుష్పగుచ్ఛం అందజేసి శు భాకాంక్షలు తెలియజేశారు. ఉన్నత విద్యారంగాన్ని బలోపేతం చేసే దిశగా పనిచేయాలని వీసీ ప్రసాదరెడ్డి సూచించారు.

# హెచ్‌పీసీఎల్ ఆధ్వర్యంలో బీచ్ రోడ్‌లో విభిన్న స్వచ్ఛతా కార్యక్రమాలు



ఆరిలోవః ఈ నెల 16 నుండి 31 వరకు నిర్వహిస్తున్న స్వచ్ఛతా పక్షోత్సవాలలో భాగంగా హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ ఆధ్వర్యంలో ఆరిలోవలో వున్న స్కిల్ డెవలప్ మెంట్ ఇన్స్టిట్యూట్ విద్యార్థుల సహకారంతో శుక్రవారం మూడు విభిన్న కార్యక్రమాలు నిర్వహించారు.

బీచురోడ్డులోని కాళీ మాత ఆలయం నుండి వైఎంసీఏ వరకు నగరంలోని వివిధ పాఠశాలల 800 మంది విద్యార్డులతో భారీ ర్యాలీ నిర్వహించారు. దీనికి హెచ్పీసీఎల్ మానవ వనరుల విభాగ జనరల్ మేనేజర్ కే.నగేష్ జెండా ఊపి ప్రారంభించారు. విభిన్న యూనిఫారంలలో ఉన్న యువత దారి పొడవునా స్వచ్ఛతా నినాదాలతో సముద్ర అలలతో పోటీ పడ్డారు.

రెండవదైన ఒక మనిషి-ఒక రోజు-ఒక లక్ష విత్తన బంతుల నాటడం కార్యక్రమంలో ఎవరెస్ట్ అధిరోహకుడు, సాహస క్రీడల ప్రతినిధి అనిమేష్‌కు ఇన్స్టిట్యూట్ విద్యార్ధులు తయారు చేసిన పర్యావరణహిత విత్తన బంతులు అందజేశారు.

మూడవదిగా రాబోయే వినాయక చవితి సందర్భంగా విత్తనాలు కూర్చిన వెయ్యి మట్టి విగ్రహాలను పాదచారులకు ఉచితంగా పంపిణీ చేశారు. ఫిట్ ఇండియా ఉద్యమాన్ని ప్రజలలోకి తీసుకుపోయే విధంగా చిన్నారులు ప్రదర్శించిన స్కేటింగు, శరీరం చుట్టూ రింగు తిప్పడం, మానవ పిరమిడ్లు అందరినీ ఆశ్చర్య చకితులని చేశాయి. ఈ సందర్భంగా నగేష్ మాట్లాడుతూ ప్రజల అభ్యున్నతి కొరకు ప్రభుత్వాలు ప్రకటించే ప్రతి పథకాన్ని ముందుకు తీసుకు పోవడంలో హిందుస్థాన్ పెట్రోలియం ఎల్లప్పుడూ ముందుంటుందని, అందరి సహకారం ఇలాగే వుంటే మన స్వరాజ్యం సురాజ్యమై వెలుగొందుతుందని, ఇందుకు చేయూత నిస్తున్న ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలియజేశారు.

## ఫ్రెండ్స్ యూత్ ఆధ్వర్యంలో వినాయక మహోత్సవాలు

రోలుగుంట : రోలుగుంట మండలం బుచ్చెంపేట ఫ్రెండ్స్ యూత్ వారి ఆధ్వర్యంలో వచ్చే నెల 2 నుంచి 9వ తేదీ వరకు శ్రీశ్రీశ్రీ వరసిద్ధి వినాయక మహోత్సవాలు ఘనంగా నిర్వహించడం జరుగుతుందని ఫ్రెండ్స్ యూత్ ప్రతినిధులు తెలిపారు. 2న సోమవారం ఉదయం వినాయకునిని ప్రతిష్టించి 150 కుటుంబాలతో వినాయక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తారన్నారు. అదే రోజు ముగ్గుల పోటీలు నిర్వహించి ప్రధమ, ద్వితీయ, తృతీయ బహుమతుల అందజేస్తామన్నారు. 3న గుర్రపు పోటీలు నిర్వహిస్తామని, 4న మధ్యాహ్నం భారీ అన్నదాన కార్యక్రమం, సాయంత్రం తప్పెటగుళ్లు కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. 5న సాయంత్రం డ్యాన్స్‌బేబి డ్యాన్స్, 6న సాయంత్రం స్వామి వారి లడ్డూ వేలం పాట, వైజాగ్ వారిచే తీన్‌మార్ డప్పులు, నేల డ్యాన్స్‌లతో, భారీ లైటింగ్, బాణసంచాతో స్వామి వారి అనుపు అత్యంత వైభవంగా నిర్వహిస్తామని వారు తెలిపారు. ఈ కార్యక్రమాలను విజయవంతం చేయాలని వారు కోరారు.

## గెడ్డ ఆక్రమణపై ఫిర్యాదు

రావికమతం : వేలాది ఎకరాలకు సాగునీరందించే అప్పలరాజు చెరువు గెడ్డ ఆక్రమణపై గుమ్మాళ్లపాడు రైతులు బంటు సన్యాసినాయుడు, రామునాయుడు, గ్రామ మాజీ సర్పంచ్ కాళింగ శివయ్యనాయుడు తదితరులు తహశీల్దార్ కనకారావుకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గెడ్డను అనుకొని ఉన్న జిరాయితీ భూములను ఇటీవల అనకాపల్లికి చెందిన కర్రి సన్యాసినాయుడు, సత్యనారాయణ కొనుగోలు చేశారని, భూములను అనుకొని ఉన్న గెడ్డను ఆక్రమించుకోవాలన్న ఉద్దేశ్యంతో రాత్రికి తాటిచెట్లను తొలగించి గెడ్డ పూడ్చివేశారని చెప్పారు. దీని వల్ల గెడ్డ దిగువనున్న తమ పంటలకు నీరు చేరే అవకాశం లేదని తెలిపారు. తక్షణమే విచారణ జరిపి బాధ్యతలపై చర్యలు తీసుకోవాలని కోరారు.

# గీతం వర్సిటీలో ఎసిఎమ్ విద్యార్థి విభాగం ప్రారంభం



సాగర్‌నగర్‌: గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ విభాగంకు అనుబంధంగా అసోసియేషన్ ఫర్ కంప్యూటింగ్ మెషినరీ (ఎసిఎమ్) విద్యార్థి విభాగం శుక్రవారం ఏర్పాటయింది.

దాదాపు 600 మంది విద్యార్థులు సభ్యులుగా ఏర్పాడిన ఎసిఎమ్ విద్యార్థి విభాగాన్ని ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ డి.ఎలజిబెత్ రాణి ముఖ్యఅతిథిగా హాజరయి ప్రారంభించారు. ప్రమోజ్ ఐటి సంస్థ ట్రైనింగ్ మేనేజర్ క్రాంతి పట్నాయక్ గౌరవ అతిధిగా హాజరయ్యారు.విశిష్ఠ అతిధిగా హాజరైన అంతర్ ఐటి సంస్థ వ్యవస్థాపకుడు రజనీష్ వసంత మాట్లాడుతూ ఇంటర్‌నెట్ ఆఫ్ థింగ్స్ లో వస్తున్న మార్పులను వివరించారు. విద్యార్థుల మధ్య ఆరోగ్యకరమైన పోటీ ఉన్నత శిఖరాలకు చేరుస్తుందన్నారు. కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ విద్యార్థుల వార్షిక సంచిక "టెక్నోషీల్డ్ " ను అతిధుల ఆవిష్కరించారు. కార్యక్రమానికి కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ విభాగం అధిపతి ప్రొఫెసర్ కె.తమ్మిరెడ్డి అధ్యక్షత వహించారు.

# గ్రామ/వార్డు సచివాలయ పరీక్షలను పారదర్శకంగా.. సమర్థవంతంగా నిర్వహించండి

## జివియంసి కమిషనర్ డా.జి.సృజన



విశాఖపట్నం: గ్రామ, వార్డు సచివాలయ రిక్రూట్‌మెంట్ 2019 లో విధులు నిర్వర్తిస్తున్న అధికారులు, సిబ్బంది పరీక్షలను పారదర్శకంగా సమర్థవంతంగా నిర్వహించాలని జివియంసి కమిషనర్ డా.జి.సృజన పేర్కొన్నారు. వి.యం.ఆర్.డి.ఎ చిల్డ్రన్ థియేటర్‌లో గ్రామ, వార్డు సచివాలయ పరీక్షల అధికారులు, సిబ్బందికి నిర్వహించిన వర్క్‌షాపులో పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా శుక్రవారం ఆమె పలు సూచనలు చేశారు. సెప్టెంబరు 1 నుండి నిర్వహించే పరీక్షలను పారదర్శకంగా సమర్థవంతంగా నిర్వహించాలని కోరారు. క్లస్టర్స్ వారీగా వివిధ అధికారులు, సిబ్బందికి కూలంకుషంగా సూచనలు చేశారు. అందరు అధికారులు, సిబ్బంది వారికి అందజేసిన హేండ్‌బుక్ ఆఫ్ ఇన్‌స్ట్రక్షన్స్ ను పూర్తిగా అవగాహన పెంపొమదించుకొని పరీక్షలను నిర్వహించాలని పేర్కొన్నారు.

క్లస్టర్, రూట్, స్ట్రాంగ్ రూం, చీఫ్ సూపరింటెండెంట్, అదనపు చీఫ్ సూపరింటెండెంట్, సెంటర్ స్పెషల్ ఆఫీసర్లు వారికి నిర్దేశించిన పనులను సక్రమంగా, తు.చ. తప్పకుండా సకాలంలో నిర్వర్తించాలని కోరారు. స్ట్రాంగ్ రూంల వద్ద సి.సి.టి.విల ఏర్పాటు, వీడియోగ్రాఫర్లు, త్రాగునీరు, పారిశుధ్యం వంటి అన్ని ఏర్పాట్లు సక్రమంగా చేయాలని కోరారు. 223 పరీక్షా కేంద్రాలలో అన్ని ఏర్పాట్లు పూర్తయినట్లు వెల్లడించారు.

అధికారులు, సిబ్బంది బాధ్యతాయుతంగా, అంకితభావంతో విధులు నిర్వర్తించాలని హితవు పలికారు. ఏమైనా సందేహాలు, ఇబ్బందులుంటే తనదృష్టికి తేవాలని పేర్కొన్నారు.

వర్క్‌షాపులో అదనపు కమిషనర్-2 ఆర్.సోమన్నారాయణ, పి.డి యుసిడి వై.శ్రీనివాసరావు, అందరు క్లస్టర్, రూట్, సెంటర్, స్పెషల్ ఆఫీసర్లు హాజరైనారు.

# సిపిఎస్ రద్దుకు ఉపాధ్యాయుల వినతి

కోటవురట్ల : ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని మండల ఉపాధ్యాయులు ఎమ్మెల్యే గొల్ల బాబురావును కోరారు. ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. సీఎం హామీ ఇచ్చినట్లుగా సిపిఎస్ రద్దు చేయాలని, దసరా సెలవుల్లోగా ఉపాధ్యాయ బదిలీలు పూర్తి చేయాలని, అమ్మఒడి పథకాన్ని ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు మాత్రమే వర్తింపజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పిఆర్‌టియూ మండల శాఖ అధ్యక్ష, కార్యదర్శులు వివిఎన్.హరికృష్ణ, ఆర్.ప్రతాప్‌కుమార్, ఏపిటిఎఫ్ మండలశాఖ అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.లచ్చబాబు, సంగీత్‌రాజ్ పాల్గొన్నారు.

## సిపిఎస్ కమిటీని కలిసిన ఏపిసిపిఎస్‌ఈఎ ప్రతినిధులు

నర్సీపట్నం : సిపిఎస్ రద్దు కోసం వేసిన మంత్రుల కమిటీని ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్‌గణేష్ సహకారంతో ఏపిసిపిఎస్‌ఈఎ ప్రతినిధులు అమరావతిలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఏపిసిపిఎస్‌ఈఎ జిల్లా కార్యదర్శి గాడి సూర్యప్రకాష్, అధ్యక్షుడు కె.సతీష్ మాట్లాడుతూ సిపిఎస్ రద్దు చేసి పాత పింఛన్ విధానాన్ని కొనసాగించాలని మంత్రులు కమిటీకి వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు. కమిటీలో ఉన్న రాష్ట్ర మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఆళ్ల నాని, ఆదిమూలపు సురేష్‌ను కలిసి సిపిఎస్ రద్దుకు సహకరించాలని కోరినట్టు తెలిపారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని కోరామని తెలిపారు. ఈ సందర్భంగా ఇచ్చిన మాటకు కట్టుబడి సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లటానికి సహకరించిన ఎమ్మెల్యేకి కృతజ్ఞతలు తెలిపారు.

## ముమ్మరంగా పారిశుద్య తొలగింపు పనులు

గొలుగొండ : మండలంలోని జోగుంపేట, ఏటిగైరంపేట చీడిగుమ్మల గ్రామ పంచాయతీల్లో చురుగ్గా పారిశుద్య తొలగింపు పనులు చేపడుతున్నారు. గ్రామాల్లో నెల రోజులుగా నివాసాల మధ్య పేరుకుపోయిన పూడికలను డిఎల్‌పిఒ శిరీషారాణి ఆదేశాల మేరకు తొలగిస్తున్నారు. దీనిలో భాగంగా అధికారులు పరిసరాల శుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శులు రఘురాం, గౌరి, గ్రామ వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

## ఎరువులు అధిక ధరలకు అమ్మితే చర్యలు

యలమంచిలి రూరల్ : దుకాణాల్లో గరిష్ట చిల్లర ధరకే(ఎంఆర్‌పి) ఎరువులు విక్రయించాలని స్థానిక వ్యవసాయశాక ఏడి మాణిక్యాంబ కోరారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బస్తాపై ఉన్న ధర కంటే ఒక్క రూపాయి అదనంగా తీసుకున్నా చర్యలు తీసుకుంటామన్నారు.

## అధిక ధరలకు ఎరువులు విక్రయిస్తే చర్యలు

మాకవరపాలెం : అధిక ధరలకు ఎరువులను విక్రయిస్తే షాపులను సీజ్ చేస్తామని మాకవరపాలం మండల వ్యవసాయాధికారి సిహెచ్.చిరంజీవి స్పష్టం చేశారు. ఈ మేరకు ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. ఎరువుల దుకాణాలను ఎమ్మార్పీ కంటే ఎక్కువగా విక్రయిస్తే షాపులను సీజ్ చేస్తామన్నారు. రైతులు కూడా అధిక ధరలు ఇచ్చి ఎరువులను కొనుగోలు చేయాల్సిన అవసరం లేదన్నారు. ఎక్కడైనా అధికంగా వసూలు చేస్తే తమ దృష్టికి తీసుకురావాలన్నారు.

## కొండ దిగువ దేవస్థానం పరిసరాలను పరిశీలించిన ఈ ఓ

సింహాచలం: శ్రీవరాహలక్ష్మీనరసింహ స్వామివారి దేవస్థానం కార్యనిర్వహణాధికారి ఎం వెంకటేశ్వరరావు కొండక్రింద దేవస్థాన పరిశర ప్రాంతాలను ఆకస్మికంగా సందర్శించారు . ముందుగా కార్యనిర్వహణాధికారి వారి పరిపాలన కార్యాలయం, పుష్కరిణి సత్రం, తొలిపావంచా , మెట్లమార్గం , దుకాణ సముదాయ పరిశర ప్రాంతాలు, స్వామివారి వరహాపుష్కరిణి , భైరవవాక మొదలగు ప్రాంతాలను సందర్శించి ఆయా ప్రదేశాల్లో ఉన్న సమస్యలు, అభివృద్ధి పనులు వంటివి మొదలగు వాటిని పరిశీలించారు. అనంతరం అయన మాట్లాడుతూ సింహాద్రిఅప్పన్న భక్తులను దృష్టిలో పెట్టుకుని అభివృద్ధి పనులు చేస్తామని అన్నారు.

కొండపైన ఎందుకు పనికిరాకుండా ఉన్న గిరిజన కాలనీ, కొండక్రింద ఉన్న స్వామివారి ఉద్యానవనం, వరహాపుష్కరిణికి వర్షాధారం వలన వచ్చే నీటి మార్గం సుగమం వంటి వాటిపై ఓ నివేదిక , ఎస్టిమేషన్ వేయమని సాంకేతివిభాగం అధికారులను ఆదేశించినట్లు తెలిపారు.

అయన వెంట విఆర్ఓ జామి రాము, సూపరిండెంట్ రమణ ఇతర దేవస్థానం సిబ్బంది ఆయన వెంట ఉన్నారు

# స్థానిక ఎల్‌బి కళాశాలలో బ్యాడ్మింటన్ టోర్నమెంట్ ఏర్పాటు



విశాఖపట్నంః స్థానిక డా లంకపల్లి బుల్లయ్య కళాశాల మరియు లక్ష్య బ్యాడ్మింటన్ అకాడమీ, గ్రీన్ సిటీ టౌన్‌షిప్, ఫకీర్తక్య, విశాఖ వారి సంయుక్త ఆధ్వర్యంలో 2019-2020 విద్యా సంవత్సరానికి అంతర కళాశాలల (స్త్రీ పురుష) బ్యాడ్మింటన్ టోర్నమెంట్ విశ్వవిద్యాలయ టీమ్ ఎన్నికకు సంబంధించిన ప్రారంభోత్సవ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరైన ఆంధ్ర విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ఆచార్య వి కృష్ణ మోహన్ టోర్నమెంట్‌ను లాంఛనంగా మొదటి ఆటను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆంధ్ర విశ్వవిద్యాలయానికి అనుబంధంగా ఉన్న కళాశాలల నుంచి ఔత్సాహికులు అయిన బ్యాడ్మింటన్ క్రీడాకారులను ప్రోత్సాహించే నిమిత్తం ఈ టోర్నమెంట్‌ను నిర్వహిస్తున్నాం అని, దీని నిర్వహణ కోసం డా. లంకపల్లి బుల్లయ్య కళాశాల, లక్ష్య బ్యాడ్మింటన్ అకాడమీ సహకారం అందించడం మిక్కిలి ప్రశంసనీయం అని, ముఖ్యంగా డా. లంకపల్లి బుల్లయ్య కళాశాలలో క్రీడా రంగానికి చెందిన వివిధ క్రీడా కారులను తీర్చి దిద్దడానికి తగిన సహకారం ప్రోత్సాహం ఇస్తున్న కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ డా జి మధుకుమార్ , డైరెక్టర్ డా. కె సత్యనారాయణ, ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగం అధ్యాపకులు అభినందనీయులు అని ప్రశంసించారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగం అధిపతి ఆచార్య ఎన్. విజయమోహన్ మాట్లాడుతూ ఈ టోర్నీలో ఎన్నిక అయిన బ్యాడ్మింటన్ క్రీడాకారులు ఆంధ్ర విశ్వవిద్యాలయం తరపునన దేశంలో ఇతర విశ్వవిద్యాలయాలతో అంతర విశ్వవిద్యాలయ బ్యాడ్మింటన్ పోటీలలో తమ ప్రతిభను చాటుకుంటారనిచెప్పారు. డా. లంకపల్లి బుల్లయ్య కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ డా జి మధుకుమార్ మాట్లాడుతూ తమ కళాశాలలో విద్యతో పాటు, క్రీడలు, ఎన్ ఎస్ఎస్, ఎన్‌సిసి మరియు విద్యార్థుల సర్వాంగీణ వికాసం కొరకు నైతిక విలువలు కలిగిన వాతావరణం కల్పిస్తూ ఇటువంటి క్రీడాంశలను నిర్వహించడానికి అవకాశం కల్పించి నా ఆంధ్ర విశ్వవిద్యాలయం ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగం, మరియు అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ డా. జిఎస్‌కె చక్రవర్తి అధ్యక్షత వహించిన ఈ సభలో, లక్ష్య బ్యాడ్మింటన్ అకాడమీ ముఖ్య శిక్షకుడు వి.మురళీకృష్ణ, కళాశాల ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగం అధిపతి డా వై.పోలిరెడ్డి, ఫిజికల్ డైరెక్టర్లు శ్రీ వై.శ్రీనివాసరావు, డా బి ఆర్ ఎస్ లక్ష్మణ రెడ్డి, వివధ కళాశాలలకు చెందిన ఫిజికల్ డైరెక్టర్‌లు, బ్యాడ్మింటన్ క్రీడాకారులు పాల్గొన్నారు.

ఈస్ట్ కోస్ట్ రైల్వే
ప్రకటన నెం. eT-SrDME-WAT-120-2019
పని పేరు: విశాఖపట్నం కోచింగ్ డిపో వద్ద విశాఖపట్నం ప్రాతిపదికగా ప్రైమరీ రైళ్ళు (గ్రూపు-ఎ) నందు ఆన్ బోర్డు హౌస్ కీపింగ్ సేవలు మరియు బెడ్ రోల్ పంపిణీ సేవలు 45 నెలలు కాలంపాటు నిర్వర్తించుట.
పని విలువ సుమారు: ₹13,94,97,780.84, బయానా: ₹ 8,47,500/-, టెండరు డాక్యుమెంట్ ఖరీదు: ₹ 11,800/-, పని పూర్తి చేయు కాలం: 45 (నలభై అయిదు) నెలలు.
టెండరు ముగింపు తేదీ మరియు సమయం: 16.09.2019న 1500 గంటలు
ఇందుకు సంబంధించి మాన్యువల్ ఆఫర్లు ఇ-టెండర్లకు సంబంధించి పోస్టు / కొరియర్ / ఫ్యాక్స్ లేదా స్వయంగా తమ సంస్థ లెటర్ హెడ్స్ పైన, సకాలంలో అందునట్లు పంపినప్పటికి అంగీకరించబడవు. అట్టి అన్ని మాన్యువల్ ఆఫర్లు చెల్లుబాటు కానివిగా పరిగణించబడతాయి మరియు ఎలాంటి పరిశీలన లేకుండానే తిరస్కరించబడతాయి.
పై ఇ-టెండరుకు సంబంధించిన పూర్తి సమాచారం ఇ-టెండరు డాక్యుమెంట్లతో పాటు http://www.ireps.gov.in వెబ్‌సైట్ నందు లభిస్తాయి.
సూచన: విశ్వసనీయ టెండరుదారులు ఈ టెండరుకు సంబంధించి ఏదైన మార్పులు / సవరణలు కోసం టెండరు ముగింపు తేదీకి 15 (పదిహేను) రోజులు ముందుగా ఈ టెండరును మరొకసారి చూడవలసినదిగా సలహానీయటమైనది.
సీనియర్ డివిజనల్ మెకానికల్ ఇంజనీరు/ వాల్తేరు
PR-326/K/19-20

# విజయభాను సంపాదకీయం

## పత్రికా స్వేచ్ఛ అణచివేత తగదు

పత్రికా స్వేచ్ఛ, విలువల కోసం నిలువవలసిన ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (పీసీఐ) మీడియాపై ఆంక్షలను సమర్థిస్తూ సుప్రీంకోర్టులో అఫిడవిట్ దాఖలు చేయడం, పైగా పత్రికా స్వేచ్ఛ, దేశ ప్రయోజనాలు పరస్పర విరుద్ధమనే రీతిలో కుతర్కాన్ని వినిపించడం తీవ్ర అభ్యంతరకరం. తీవ్ర విమర్శలు పెల్లుబుకడంతో పీసీఐ చైర్మన్ సుప్రీం కోర్టుకు సమర్పించిన అఫిడవిట్‌ను మార్చుకున్నట్టు కనిపించినా, ఆ వైఖరిలో మాత్రం తేడా కనిపించడం లేదు. కశ్మీర్‌లోని వార్తలను స్థానిక పత్రికలే కాకుండా, ఇతర రాష్ట్రాలలోని మీడియా కూడా సేకరించడం అసాధ్యమైపోయింది. ఈ నేపథ్యంలో కమ్యూనికేషన్స్‌పై ఆంక్షలను ఎత్తివేయాలని కోరుతూ కశ్మీర్‌లోని ఒక పత్రిక ఎడిటర్ సుప్రీం కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. పత్రికా స్వేచ్ఛకు అండగా నిలువడం ప్రెస్ కౌన్సిల్ విద్యుక్త ధర్మం. కానీ పీసీఐ చైర్మన్ స్వయంగా ఈ విషయంలో సుప్రీం కోర్టులో అఫిడవిట్ దాఖలు చేస్తూ దేశ సమగ్రత, సార్వభౌమత్వ పరిరక్షణ కోసం హేతుబద్ధమైన ఆంక్షలు అవసరమని చెప్పడం ఆశ్చర్యకరం. ప్రెస్‌కౌన్సిల్ చట్టబద్ధ సంస్థ. పత్రికా స్వేచ్ఛకు ఆటంకం వాటిల్లకుండా చూడటం, పత్రికా విలువలకు భంగం కలుగకుండా చూడటం పీసీఐ బాధ్యత. పంజాబ్‌లో ఉగ్రవాదం తీవ్రరూపం దాల్చినప్పుడు, నిజాయితీగా వార్తలను అందించడం పత్రికలకు కత్తిమీద సాము మాదిరిగా మారినప్పుడు పీసీఐ ఎంతో గురుతరమైన బాధ్యతను పోషించింది. అయోధ్య వివాదం పతాకస్థాయికి చేరుకున్నప్పుడు, కొన్ని హిందీ పత్రికలు మతవిద్వేషం రగిలించే కథనాలు ప్రచురించినందుకు ప్రెస్‌కౌన్సిల్ వాటిని తప్పు పట్టింది. అంతటి ఘన చరిత్ర ఉన్న ప్రెస్‌కౌన్సిల్‌ను పత్రికా స్వేచ్ఛ అణిచివేత సాధనంగా మార్చడం తగదు. ప్రెస్ కౌన్సిల్ చైర్మన్ సీకే ప్రసాద్ సుప్రీం కోర్టుకు తమ వైఖరిని తెలిపే ముందు ప్రజాస్వామ్యబద్ధంగా అంతర్గత చర్చ జరుపకపోవడం గమనార్హం. దీంతో ప్రెస్‌కౌన్సిల్ సభ్యులు కొంద రు సుప్రీంకోర్టుకు చైర్మన్ తెలిపింది ఆయన వ్యక్తిగత భావనే తప్ప కౌన్సిల్ అభిప్రాయం కాదని స్పష్టం చేశారు. నియంతృత్వ వ్యవస్థలో ప్రజలు ఏమనుకుంటున్నారో, తమ పరిపాలనలోని లోటుపాట్లేమిటో పాలకులకు తెలిసే అవకాశం ఉండదు. తమ అనుచరగణాలు చెప్పేదే సత్యమని నమ్మవలసి వస్తుంది. పాలకుల చర్యలను సమర్థించే భజన బృందాలుంటాయే తప్ప భిన్నాభిప్రాయం వ్యక్తం చేయడానికి సాహసించరు. కానీ ప్రజాస్వామ్య వ్యవస్థలో ఉన్న సౌలభ్యం- ప్రజాభిప్రాయాన్ని నిర్భయంగా వెల్లడించే వేదికలుంటాయి. ప్రతిపక్ష పార్టీలు, పత్రికలు, స్వచ్ఛంద సంస్థ లు ఇట్లా అనేక మార్గాలలో పాలకులకు వాస్తవాలు చేరే అవకాశం ఉంటుంది. ప్రజాభిప్రా యం తీవ్ర వ్యతిరేకంగా ఉన్నప్పుడు, వారి ఆగ్రహాన్ని ప్రజాస్వామ్య పద్ధతుల్లో వ్యక్తం చేసే వెసులుబాటు ఉండాలె. ప్రజాస్వామ్య పద్ధతుల్లో తమ అసంతృప్తిని వ్యక్తంచేసే మార్గం లేనప్పుడే ఎక్కడైనా ఉద్యమాలు, ఆందోళనలు పెల్లుబుకుతాయి. ప్రభుత్వం క్షేత్రస్థాయి వాస్తవాలను గ్రహించడంలో తీవ్ర జాప్యం జరుగవచ్చు. ఈలోగా పరిస్థితి చేజారిపోవచ్చు. అందుకే ప్రజాస్వామ్య వ్యవస్థలో అధికారపక్షం వారు కూడా తమకు నచ్చినా నచ్చకపోయినా తమను విమర్శించే పత్రికలను కూడా చదువుతారు. తమ పార్టీ సభ్యుల ద్వారానే కాకుండా ఇతర మార్గాలలో సమాచార సేకరణ జరిపి వాస్తవాలను తెలుసుకోవడానికి ప్రయత్నిస్తారు. తమ భజన బృందం లేదా సైన్యం చెప్పే కథనాలనే నమ్ముకున్న ప్రభుత్వాలు మనుగడ సాగించలేవు. పత్రికలు పాలకులకు నచ్చని వాస్తవాలను కూడా ప్రచురిస్తాయి. దేశ ప్రయోజనాలు నెరవేరుతాయని భావించి ఈ వాస్తవాలను ప్రచురిస్తాయే తప్ప, దేశద్రోహం చేద్దామని కాదు. పత్రికా స్వేచ్ఛ, దేశ ప్రయోజనాలు పరస్పర విరుద్ధమైనవి కాదు. మన దేశం డెబ్బయేండ్లకు పైగా స్వాతంత్ర్య చరిత్రలో అనేక ఉద్యమాలను చవిచూసింది. సమస్యలను ప్రజాస్వామ్యబద్ధంగా పరిష్కరించడం వల్ల ఆ ఉద్యమాలు సమసిపోయాయి. తెలంగాణ ఉద్యమం కూడా ప్రజాస్వామ్య పరిష్కారం ద్వారానే ఉపశమించింది. పాకిస్థాన్ నుంచి బంగ్లాదేశ్ విడిపోయిందీ అంటే అది అక్కడి నిరంకుశ ప్రభుత్వ బలహీనత. కశ్మీర్ భారత్‌లో అంతర్భాగంగా ఉన్నదీ అంటే అది మన ప్రజాస్వామ్య వ్యవస్థకున్న బలం. 1992 జనవరి 26న శ్రీనగర్‌లో జెండా ఎగురవేస్తానని బీజేపీ నేత మురళీ మనోహర్ జోషి ప్రకటించినప్పుడు, ప్రధాని పీవీ నరసింహారావు వాయుమార్గంలో ఆయనను తీసుకుపోయి, సైనిక బలగాల రక్షణలో పతాకావిష్కరణ చేసే ఏర్పాట్లు చేశారు. పీవీ చర్య వల్ల కశ్మీర్ అదుపులోనే ఉందనే సంకేతం ఇతర దేశాలకు వెళ్ళింది. ఇప్పుడు ప్రతిపక్ష ప్రముఖుడు సీపీఎం నేత సీతారామ్ ఏచూరి కశ్మీర్ వెళ్ళి అనారోగ్యంతో ఉన్న మిత్రుడిని పరామర్శించడానికి సుప్రీంకోర్టు తలుపు తట్టవలసి వచ్చింది. సైన్యం పహరాలో జైలులోని ఖైదీతో ములాఖత్ ఏర్పాటు చేసినట్టుగా సాగింది ఆయన పరామర్శ. కశ్మీర్‌కు ప్రతిపక్ష నాయకులు వెళ్ళలేరు, పత్రికలు వార్తలు రాయలేవు.

## దేశ వ్యాప్తంగా సీబీఐ ఆకస్మిక సోదాలు

దిల్లీ: దేశ వ్యాప్తంగా కొన్ని ప్రభుత్వ సంస్థల్లో కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ) అధికారులు ఆకస్మిక తనిఖీలు చేపడుతున్నారు. శ్రీనగర్ సహా 30 నగరాల్లో దాదాపు 150 ప్రభుత్వ కార్యాలయాల్లో సోదాలు జరుగుతున్నాయని సీబీఐ అధికారి ఒకరు శుక్రవారం తెలిపారు. రైల్వే, బీఎస్ఎన్ఎల్, షిప్పింగ్, విమానాశ్రయాల ప్రాధికార సంస్థ, బొగ్గు, ఆహార, కస్టమ్స్, విద్యుత్, మున్సిపల్, కంటోన్మెంట్, అగ్నిమాపక, పరిశ్రమలు, జీఎస్టీ, రవాణా, విదేశీ వాణిజ్యం, పురావస్తు శాఖ, ప్రభుత్వ రంగ బ్యాంకులు తదితర విభాగాల్లో సీబీఐ తనిఖీలు చేపడుతున్నారు.

హైదరాబాద్, శ్రీనగర్, దిల్లీ, జైపూర్, జోధ్‌పూర్, గువహటి, షిల్లాంగ్, చండీగఢ్, సిమ్లా, చెన్నై, మధురై, కోల్‌కతా, హైదరాబాద్, బెంగళూరు, ముంబయి, పుణె, గాంధీనగర్, గోవా, భోపాల్, జబల్‌పూర్, నాగ్‌పూర్, పట్నా, రాంచీ, ఘజియాబాద్, డెహ్రాడూన్, లఖ్‌నవూ, వడోదర, అహ్మదాబాద్, కొచ్చి నగరాల్లో సీబీఐ సోదాలు సాగుతున్నట్లు అధికారి వెల్లడించారు. అయితే, దేశ వ్యాప్తంగా సీబీఐ ఆకస్మిక సోదాలకు గల కారణాలేంటో తెలియాల్సి ఉంది.

## ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు పుస్తకాలను పంపిణీ



గాజువాక: పెదగంట్యాడ మండలం గంగవరంగ్రామం, దిబ్బపాలెంలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు గంగవరం పోర్టు సంస్థ పుస్తకాలను, స్టేషనరీని పంపిణీ చేసింది. కార్పోరేట్ సోషల్ రెస్పాన్స్‌బిలిటీ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో సంస్థ వైస్‌ప్రెసిడెంట్ (విజిలెన్స్ ఆర్‌అండ్‌ఆర్,సెక్యూరిటీ) బి.బాలకృష్ణ, వైస్ ప్రెసిడెంట్ (ఆర్‌అండ్‌ఆర్ అండ్ సెక్యూరిటీ) ఎల్.పి.యస్. రామునాయుడులు పాల్గొని విధ్యార్థులకు పంపిణీ చేసారు. ఈ సంధర్బంగా వారు మాట్లాడుతూ విద్యార్థులకు పుస్తకాలు, స్టేషనరీతో పాటు, బ్యాగ్స్, కంపాస్‌బాక్సెస్‌లు సుమారు 90మందికి పంపిణీ చేసామని తెలిపారు. పరిసరప్రాంత అభివృద్ధి, సంక్షేమంకోసం కట్టుబడి ఉన్నామని అన్నారు. విద్యా, వైద్య, స్వయంఉపాది తదితర అంశాలలో పరిసరప్రాంతవాసులకు అండగా ఉంటూ తమవంతు సహాయ,సహకారాలను అందిస్తు న్నామని తెలిపారు. మరిన్ని అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతో ముందుకుపోతూ ఆరోగ్యవంతమైన, అభివృద్ధికం్మైన సమాజాన్ని నిర్మిస్తామని, అందుకు కట్టుబడి ఉన్నామని తెలిపారు.

ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాద్యాయులు ప్రభాకరరావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల నోట్లో మట్టికొట్టొద్దు

### దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్




విశాఖపట్నం: అసమర్థత, ఒంటెద్దు పోకడితో ప్రజల నోట మట్టికొట్టదని జగన్మోహన్ రెడ్డిపై దక్షిణ నియోజకవర్గం ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ మండిపడ్డారు. ఇసుక బంగారమాయే అనే నినాదంతో విశాఖ దక్షిణ నియోజకవర్గ శాసనసభ్యులు వాసుపల్లి గణేష్ కుమార్ వైసీపీ ధన దాహానికి బలైన భవన నిర్మాణ కార్మికులు కొరకు జివిఎంసి ఎదురుగా గల గాంధీ విగ్రహం, విశాఖ సెంట్రల్ పార్క్ వద్ద ఇసుక పై నిరసన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. కేజీ ఇసుకను రూ. 5/- అమ్మేటటువంటి వినూత్న కార్యక్రమాన్ని చేపట్టడం జరిగింది. ఈసందర్భంగా వాసుపల్లి మాట్లాడుతూ వైసీపీ నిర్లక్ష్య వైఖరి వలన ఈ ఇసుక కొరత ఏర్పడి సుమారుగా 20 లక్షలకు పైగా అసంఘటిత కార్మికుల జీవనోపాధి కోల్పోవటం జరిగిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో విశాఖ సౌత్ టీడీపీ నేతలు, కార్యకర్తలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. తక్షనమే ఇసుక రీచ్లను తెరిపించాలని డిమాండ్ చేశారు. ఎక్కడ పనులు అక్కడే నిలిచిపోవడంతో భన నిర్మాణ కార్మికులు పొట్టనకొట్టారని దుయ్యబట్టారు. అమరావతి, పోలవరం ప్రాజెక్ట్ నిలిచిపోయాయని, ప్రపంచ బ్యాంకులు వెళ్ళిపోతున్నాయని, అసలు ఉద్యోగులకు జీతాలు ఇస్తారో ఇవ్వరో అన్న సందిగ్ధంలో మునిగిపోయారన్నారు. ఒక పరిపాలనలో పట్టు లేని వ్యక్తి రాష్ట్రాన్ని ఏలితే ఏ విధంగా వుంటుందో తెలుస్తుందన్నారు. ఇప్పటికైనా జగన్మోహన్ రెడ్డి తీరు మార్చుకుని ప్రజలకు మంచి పరిపాలన అందించాలన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ భవిషత్తును నాశనం చేస్తున్న వైసీపీ తీరు మారాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో బొచ్చా రామిరెడ్డి, 15వ వార్డు అధ్యక్షుడు అల్లూరి సత్యనారాయణ రెడ్డి, విల్లూరి చక్రవర్తి, బంటుపల్లి సూర్యనారాయణ, బొట్ట పరదేశి యాదవ్, చిన్న రెహమాన్, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## ఓం గణేశా పాట ను ఆవిష్కరించిన పర్యాటక శాఖా మాత్యులు అవంతి శ్రీనివాసరావు




విశాఖపట్నం :వినాయక చవితి సందర్భంగా ప్రముఖ యాంకర్, ఈవెంట్ మేనేజర్ వీరుమామ ఓం గణేశా అనే గీతాన్ని ఆలపించారని, వీరుమామ ఈ ప్రయత్నాన్ని అందరు అభినందించి,ప్రోత్సాహించాలని పర్యాటక శాఖ మంత్రి అవంతి అన్నారు. డీ మాక్ డీ.ఎం.రావు నిర్మించిన ఈ గీతాన్ని ప్రభ శర్మ గారు రచించగా, ప్రమోద్ కుమార్ సంగీతం సమకూర్చారు. ప్రముఖ గాయకులూ సాయి దేవా హర్ష,మధు,రేడియో సిటీ ఆర్ జే షర్మిల ,భువన కూడా ఈ గీతం లో పాడటం విశేషం. ఈ పాటను యూట్యూబ్ లో ఓం గణేశా అని వీక్షించ వొచ్చని, ఎటువంటి కాపీ రైట్స్ లేకుండా వాడొచ్చని వీ టీమ్ చైర్మన్ వీరుమామ తెలిపారు. కార్యక్రమంలో వీ ఎం ఆర్ డీ ఏ చైర్మన్ ద్రోణం రాజు శ్రీనివాస్, వంశీ క్రిసజ్ఞ యాదవ్, ఎం .ఎల్.ఏయ్ నాగి రెడ్డి పాల్గొన్నారు.

## గ్రామ సచివాలయ పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు ముమ్మరం

భీమునిపట్నం: భీమిలి జోన్ మరియు మండలంలో రేపు జరగబోయే గ్రామ సచివాలయం పరీక్ష నిర్వహించడానికి ఒక క్లస్టర్ స్పెషల్ ఆఫీసర్, 22 మంది చీఫ్ సూపరింటెండెంట్లు 15 మంది ఎడిషనల్ చీఫ్ సూ పరింటెండెంట్లు 22 మంది సెంటర్ స్పెషల్ ఆఫీసర్లు నియమించామని క్లస్టర్ స్పెషల్ ఆఫీసర్ మరియు జోనల్ కమిషనర్ తెలిపారు. పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు ఇటువంటి సెల్ ఫోన్ లు డివైస్ వంటి డిజిటల్ ఐటమ్స్ అనుమతించబడవని , పరీక్ష సెంటర్ కు ఉదయం 7 గంటల నుండి ఎనిమిది గంటల లోపు హాజరు కావాలని తెలియ జేశారు. పరీక్ష సమయమునకు ఒక్క నిమిషం ఆలస్యంగా వచ్చినా అనుమతించరని తెలిపారు. భీమునిపట్నం మండలం అర్బన్ అండ్ రూరల్ హలో 22 సెంటర్లో 7636 మంది పరీక్షలకు హాజరవుతున్నారని 144 సెక్షన్ అమలులో ఉంటుందని ,అభ్యర్థులు హల్ టికెట్స్ తోపాటు ఏదైనా ఒరిజినల్ ఐడెంటి కార్డు ప్రూఫ్ లేదా ఆధార్ హొటల్ డ్రైవింగ్ లైసెన్స్ మొదలగునవి తీసుకొని రావాల్సిందిగా హాల్ టికెట్స్ లో ఏదైనా తప్పులు ఉన్నట్లయితే భీమిలి జోనల్ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

## సాయి ప్రణీత్‌ను సత్కరించిన గవర్నర్

హైదరాబాద్: ప్రపంచ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్‌లో పురుషుల విభాగంలో కాంస్య పథకం సాధించిన సాయి ప్రణీత్‌ను తెలంగాణ గవర్నర్ నరసింహన్ అభినందించారు. 36 ఏళ్ల తర్వాత ఈ విభాగంలో కాంస్య పథకం సాధించడం రాష్ట్రానికే గర్వకారణమని కొనియాడారు. ఒలింపిక్స్‌లో బంగారు పథకం సాధించాలని ఆకాంక్షించారు. సాయి ప్రణీత్‌ను రాజ్‌భవన్‌లో గవర్నర్ నరసింహన్ దంపతులు సత్కరించారు. ఈ సన్మాన కార్యక్రమానికి బ్యాడ్మింటన్ కోచ్ పుల్లెల గోపిచంద్ హాజరయ్యారు. సాయి ప్రణీత్ కెరీర్ ఇప్పుడే ప్రారంభమైందని.. భవిష్యత్‌లో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహిస్తాడని పుల్లెల గోపిచంద్ విశ్వాసం వ్యక్తం చేశారు. సాయి ప్రణీత్ మాట్లాడుతూ.. ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో తన ప్రదర్శన పట్ల సంతోషంగా ఉన్నానన్నారు.









## దేశాభివృద్ధికి మోడీ నిర్ణయాలు భేష్

### బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం. ఎస్. పార్థసారథి




విశాఖపట్నం: గత ఎన్నికలతో పోలిస్తే ఈ మూడు నెలల్లో ప్రధానీ మోడీ తీసు కుంటున్న నిర్ణయాలపై ఏపీ ప్రజలు ఆసక్తికనబరుస్తున్నారని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం. ఎస్. పార్థసారథి అన్నారు. నగరంలో బీజేపీ పార్టీ కార్యలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇటీవల జరిగిన ఎన్నికల ఫలితాల్లో 1400 ఓట్లు వచ్చిన నియోజకవర్గాల్లో నేడు దాదాపు 1400 కు పైగా ప్రజలు బీజేపీ సభ్యత్వంలో చేరారని వెల్లడించారు. స్వచ్ఛభారత్ కు కేంద్రబడ్జెట్లో 5శాతం నిధులు కేటాయించి, వాటిని నేరుగా పంచాయితీలకు చేరడం వలన పారిశుద్య సమస్యలు చాలావరకు పరిష్కారం అయ్యాయన్నారు. గత యూపీఏ ప్రభుత్వం బడ్జెట్ కేటాయింపు కేవలం రూ.16లక్షల కోట్లు అయితే ఎన్డీఏ ప్రభుత్వం మోడీ నిర్ణయాలతో పెరిగిన కేంద్రం బడ్జెట్ నేడు 27లక్షల కోట్లు రూపాయాలని వెల్లడించారు. దీనివలన దేశంలో అన్ని ప్రాంతాలు, అన్ని రం గాలు అభివృద్ధి చెందుతున్నాయ న్నారు. ప్రజలు ఆరోగ్యంగా వుంటేనే అభివృద్ధి చెందుతుందని, 'ఫిట్' ఇండియాను ప్రవేశపెట్టారన్నారు. చంద్రబాబుపై వ్యతిరేకత వలనే వైసీపీ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిందన్నా రు. కాంగ్రెస్ తో జతకట్టి బీజేపీపై విష్రచారం చేయడం వలనే టీడీపీ ఏపీ కనుమరుగైందని విమర్శించారు. ఈ సమ వేశంలో భారతీయ జనతా పార్టీ నగర అధ్యక్షు డు ఎం. నాగేంద్ర, నాయకులు వేణుగోపాల్, పీవీ. నారాయణ, ప్రకాష్ రెడ్డి పాల్గొన్నారు.

## ఇసుక లభ్యత లేనికారణంగా జీవనోపాధి కోల్పోతున్న కార్మికులు

### టీడీపీ నాయకుడు శ్రీభరత్




విశాఖపట్నం: వైసీపీ ప్రభుత్వం ప్రజలకు అందిస్తున్న పాలసీలకు టీడీపీ వ్యతిరేకం కాదని ఇసుక తోట పెట్రోల్ బంక్ వద్ద శుక్రవారం భవన నిర్మాణ కార్మికులు చేపట్టిన నిరసన కార్యక్రమంలో టీడీపీ నాయకుడు శ్రీభరత్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీభరత్ చేసిన వ్యాఖ్యలు సంచలనం కలిగించాయి. భవన నిర్మాణానికి అత్యంత ఆవశ్యకమైన ఇసుకను అందరికి అందేవిధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని. ఇసుక లభ్యత కొరవడడంతో భవన నిర్మాణ కార్మికుల జీవనం ప్రశ్నార్థకంగా మారు తోందని, ప్రభుత్వం భవన నిర్మాణ కార్మికులకు అండగా నిలవాలన్నారు. ఇసుక లభ్యతలేని కార ణంగా పనులులేక కార్మికులు అయోమయానికి గురవుతున్నారన్నారు. ప్రభుత్వం ఇసుకను సక్రమంగా రవాణాచేసేవరకు తెలుగుదేశంపార్టీ కార్మికులకు అండగా నిలుస్తుందన్నారు. ఈ నిరసన కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు పట్టాబి, పోతనరెడ్డి, అధిక సంఖ్యలో భవన నిర్మాణ కార్మికులు పాల్గొన్నారు.

రోజుకి రూ. 25/- మాత్రమే Size 1x3 విజయభాను Minimum 7 days క్లాసిఫైడ్స్
సంప్రదించవలసిన ఫోన్ నెంబర్ : 2564353, 2560004

DISTANCE EDUCATION
డిగ్రీ రెగ్యులర్‌లో లేదా డిస్టెన్స్‌లో చదివి Discontinued / Fail అయిన సబ్జెక్టులను AU డిస్టెన్స్ ఎడ్యుకేషన్ ద్వారా పూర్తి చేసుకోవచ్చు. అడ్మిషన్స్ ఆఖరు తేది. 10-9-19. పరీక్ష తేది : ఏప్రిల్/మే, 2020
7842353237, 9014548285

ASTROLOGY
శ్రీ శ్రీ కాణిపాకం స్వామి జ్యోతిష్యా/వాస్తు సమస్యలకు 25 సం॥రాలుగా సరైన పరిష్కారములు సూచిస్తున్నారు. అవసరమైన వారు పర్సనల్ అపాయింట్‌మెంట్ కొరకు ఈ ఫోన్ నెంబర్‌ను సంప్రదించవలెను.
9393110416

FINANCE
స్టేట్/సెంట్రల్ రిటైర్డ్ పెన్షనర్స్‌కు మాత్రమే. రూ. 30వేల నుండి 3 లక్షల వరకు విశాఖ నుండి విజయవాడ వరకు మధ్యలో ఎక్కడైనా సరే స్పాట్ ఫైనాన్స్ (with A/c Pay) చేయబడును.
JK అసోసియేషన్ సర్వీసెస్
Govt. Reg. No. 136/2009 (నో బ్రోకర్స్)
96665 47338

## గ్రామ సచివాలయ పరీక్షలకు ఏర్పాట్లు

నర్సీపట్నం : గ్రామ సచివాలయ పరీక్షలకు ఏర్పాట్లు చేసినట్లు నర్సీపట్నం తహశీల్దార్ ఎంవి.శ్రీనివాస్ తెలిపారు. శుక్రవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ నర్సీపట్నం పరిధిలో 21 పరీక్షా కేంద్రాలు ఉన్నాయన్నారు. నర్సీపట్నం మున్సిపాలిటీలో 16 కేంద్రాలు, వేములపూడిలో రెండు కేంద్రాలు, మాకవరపాలెంలో మూడు కేంద్రాల్లో పరీక్షలు జరుగుతాయన్నారు. ఈ నెల 1న ఉదయం 10 గంటల నుండి 12.30 వరకు, మధ్యాహ్నం 2.30 గంటల నుండి 5 గంటల వరకు పరీక్ష జరుగుతుందన్నారు. పరీక్షా సమయానికి గంట ముందే అభ్యర్థులు చేరుకోవాలన్నారు. పరీక్షకు హాల్ టిక్కెట్, బ్లూ లేదా బ్లాక్ బాల్‌పెన్, ఆధార్, ఓటరు కార్డు, డ్రైవింగ్ లైసెన్స్, పాన్ కార్డు వంటివి తీసుకురావాన్నారు. ఒక్క నిమిషం ఆలస్యమైనా ప్రవేశం ఉండదన్నారు. పరీక్ష హాలులోని సెల్‌ఫోన్‌లు, కాలక్యులేటర్, పుస్తకాలు అనుమతించరన్నారు.

## ఇంటిని ఢీకొట్టిన లారీ



అనకాపల్లి : మండలంలో బవులువాడ రిక్షా కోలనీ సమీపంలో గల త్రిమూర్తులు గుడి వద్ద ఒక క్వారీ లారీ శుక్రవారం ఉదయం అదుపుతప్పి ఒక ఇంటిని ఢీకొట్టింది. పెనువేగంతో ఆ లారీ ఇంట్లోకి దూసుకుపోయినా ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేక పోవడంతో పెను ప్రమాదం తప్పింది. ఈసంఘటనలో లారీ ముందు భాగం నుజ్జు కాగా డ్రైవర్, క్లీనర్ సురక్షితంగా తప్పించు కున్నారు. కేసును రూరల్ ఎస్ ఐ రామకృష్ణరావు దర్యాప్తు చేస్తున్నారు.

## మట్టి విగ్రహాలే ముద్దంటూ ఉషోదయ విద్యార్థులు భారీ ర్యాలీ



చోడవరంలో భారీ ర్యాలీ నిర్వహిస్తున్న ఉషోదయ కళాశాలల విద్యార్థులు

చోడవరం : వినాయక చవితికి ప్రతి ఒక్కరు మట్టి విగ్రహాలనే పూజించాలని, పర్యావరణంకు ఇబ్బంది కలిగించని మట్టి విగ్రహాలే ముద్దంటూ స్థానిక ఉషోదయ కళాశాలల విద్యార్థులు శుక్రవారం చోడవరంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఉషోదయ విద్యా సంస్థల ఛైర్మన్ జె. రమణాజీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఉషోదయ డీన్ ఎస్.వి.వాసు, కళాశాల విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

## హెూంమంత్రిని అభినందిస్తున్న క్రైస్తవ ప్రముఖులు



దేవరాపల్లి : రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజల శ్రేయస్సు కోసం ముఖ్యమంత్రి వైఎస్. జగన్మోహనరెడ్డి చేపట్టిన నవరత్నాల పథకాలు అమోఘమని నేషనల్ క్రిస్టియన్ కౌన్సెల్ ,రాష్ట్ర గిరిజన విభాగం వెల్ఫేర్ అధ్యక్షులు రెవ.బిషప్ జి.టైటస్ అన్నారు. రాష్ట్ర హెూంమంత్రి, ఉప ముఖ్యమంత్రి మేకతోటి సుచరితను గురువారం విజయవాడలో కలసి పలు సమస్యలపై వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు ఇస్తున్న గౌరవం, ప్రోత్సహిస్తున్నా విధానం హర్ష ణీయమన్నారు. అదే తరహాలో స్త్రీలపై, బాలికలపై, క్రీస్తువలపై, దళితులపై జరుగుతున్న దాడులను ఆరికట్టడానికి ప్రభుత్వం ప్రత్యేక చట్టాలు తీసుకొచ్చి నిందితులకు కఠిన శిక్షలు పడేలా చర్యలు చేపట్టాలని వారు హెూంమంత్రికి విజ్ఞప్తి చేశారు. మంత్రిని కలిసిన వారిలో ప్రముఖ క్రిస్టియన్ నాయకులు రెవడానియల్ శ్యామ్, డా ప్రసన్న కుమార్ ఉన్నారు.

## ఎన్‌సిసి క్యాడెట్‌లకు 'బి' సర్టిఫికెట్లు ప్రదానం



విశాఖపట్నం : 159 సంవత్సరాల మన చరిత్ర కలిగిన మిసెస్ ఏవిఎన్ కళాశాలలో శుక్రవారం 13 ఆంధ్ర బెటాలియన్ కు చెందిన ఎన్‌సిఎస్ క్యాండెట్‌లకు బి.సర్టిఫికెట్లు ప్రధానం చేయబడ్డాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధి గా 13 ఆంటీ బెటాలియన్ అడ్మినిస్ట్రేటిస్ ఆఫీ సర్ అయినా లెఫ్టినెంట్ కల్నల్ సోనియ సాలియా గారు హాజరయ్యారు. అర్హులైన కెట్ అందరకు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా నూగుతూ రెండు సంవత్సరాలు కఠోర శ్రమ అనంతరం ఈ సర్టిఫికేట్ లు పొందారని తెలియజేశారు. అనంతరం కళాశాల తన్సిపాల్ ఆచార్య ది.విజయ్ ప్రకాష్ మాట్లాడుతూ ఎన్సీసీ కెనేట్ లకు క్రమశిక్షణ, సమయసాలన చదువు మీద శ్రద్ధ వుండడం చేత సర్టిఫికెట్లు పొందారు అని తెలియజేశారు.

కళాశాల ఎన్‌సిసి అధికారి కెఫెన్, డాక్టర్. రామ కృష్ణ పర్యవేక్షణలో ఈ కార్యక్రమం జరిగింది. డాక్టర్ రామకృష్ణ కినేట్ అందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు.

## రాజుపాక గ్రామంలో మెడికల్ క్యాంపు



అనంతగిరి : మండలం లోని అనంతగిరి పంచాయతీ పరిదిలో రాజుపాక గ్రామంలో శుక్రవారం మెడికల్ క్యాంపు జరిగింది. ఈ మెడికల్ క్యాంపునకు 21మంది ఓపి, 16, రక్త పరీక్షలు, దగ్గు, జలుబు, విషజ్వరాలు, గుర్తించడం జరిగింది అని డా.. అనుష తెలి పారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది నందయ్య దాలన్న దొర సన్నమ్మ, ఆశ పద్మ, రోగులు పాల్గొన్నారు.

## ఆపదహర శ్రీనివాస క్షేత్రంలో భక్తిశ్రద్ధలతో సామూహిక కుంకుమార్చనలు



సామూహిక కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలు

చోడవరం : పట్టణంలోని కోపరేటివ్ కోలనీ లోని ఆపదహర శ్రీనివాసక్షేత్రంలో శ్రావణ మాసం ఆఖరి శుక్రవారం సందర్భంగా పద్మావతి దేవి అమ్మ వారికి సామూహిక కుంకుమార్చనలు భక్తిశద్ధలతో నిర్వహించారు. దేవాదాయశాఖ కార్య నిర్వహణాధికారి యస్.వి.వి.సత్య నారాయణమూర్తి ఆధ్వర్యంలో ఆలయ ప్రధాన అర్చకులు గుంటూరు శాంతారామాఛార్యులు, అర్చకులు వెంకట వాసు అమ్మవారి కుంకుమ పూజ నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## ఇసుక కొరత తీర్చండి



తహశీల్దార్‌కు వినతి పత్రం ఇస్తున్న టీడీపీ నాయకులు

కోటవురట్ల : ఇసుక కొరడ తీర్చాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం టీడీపీ మండలాధ్యక్షులు లాలం కాశీ నాయుడు అధ్వర్యంలో తహ శీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కాశీ నాయుడు మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇసుక కొరత సృష్టిం చడంతో భవన నిర్మాణ కార్మికులు, కూలీలు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కోంటు న్నారన్నారు. వెంటనే ప్రజల కష్టాలను తెలుసు కొని వాటి పరిష్కార మార్గాలు చూపాలని కోరారు. అనంతరం తహశీల్దార్ రామారావుకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మండలంలోని టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## లక్ష్మణరావు కుటుంబాన్ని జివిఎంసి ఆదుకోవాలి



విశాఖపట్నం : జోన్-2 సీతమ్మధార ప్రాంతంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ క్లీనింగ్ చేస్తుండగా మ్యాన్‌హెూల్ నుండి గ్యాస్ ముఖానికి తగిలి ప్రమాదవశాత్తు పని ప్రదేశంలో పక్షవాతం వచ్చి ఎడమ చెయ్యి, ఎడమకాళ్ళు పనిచేయడం లేదు. అక్కడ వున్న తోటి కార్మికులు ఆయనను వెంటనే కెజిహెచ్‌లో జాయినింగ్ చేయడం జరిగింది.శ ుక్రవారం ఆయనను జివిఎంసి కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ జగదాంబ జోన్ నాయకులు టి.నూకరాజు, పి.అప్పలరాజు, ఇ.ఆదినారాయణ, ఎం.ఈశ్వరరావులు పరామర్శించారు. దీనికి టి.నూకరాజు స్పందిస్తూ పనిప్రదేశంలో ప్రమాదవశాత్తు ఆనారోగ్యానికి గురైన లక్ష్మణరావు కుటుంబాన్ని జివిఎంసి వెంటనే ఆదుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే నాలుగు నెలల నుండి వేతనాలు లేక దళితులైన యుజిడి కార్మికుల కుటుంబాలు పస్తులతో వున్నాయని కావున బకాయి జీతాలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

## అనకాపల్లిలో తెలుగు తమ్ముళ్లు ఆందోళన

### జత కలిసిన వామపక్షాలు.... పెద్ద ఎత్తున ర్యాలీ



అనకాపల్లి : రాష్ట్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా తెలుగుదేశంపార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున శుక్రవారం ఆందోళన కార్యక్రమాన్ని చేపట్టారు. ఇసుక సరఫరా నిలిపివేత.... అన్నా క్యాంటిన్లు మూసి వేయడం వంటి ప్రధాన సమస్యలను నిలదీస్తు ఈ ఆందోళన కార్యక్రమం జరిగింది. తెలుగుదేశంపార్టీ అధినేత నారాచంద్రబాబునాయుడు ఇచ్చిన పిలుపుమేరకు జరిగిన ఈ ఆందోళన కార్యక్రమానికి శాసన మండలి సభ్యులు బుద్ధ నాగజగదీష్, మాజీ శాసన సభ్యులు పీలా గోవిందసత్యనారాయణ, ఆ పార్టీనాయకుడు డాక్టర్ నారాయణరావు, కొణతాల వెంకటరావు, మళ్ల సురేంద్ర, బొలిశెట్టి శ్రీనివాసరావు, తదితరులు నాయకత్వం వహించారు. ముందుగా పట్టణంలోని రింగ్ రోడ్ నుండి నినాదాలు చేస్తూ నెహ్రూచౌక్ వరకు ప్రదర్శన నిర్వహించారు. ఎడ్లబళ్లపై పీలా గోవింద సత్య నారా యణ, బుద్ధ నాగజగదీష్, తదితరులు ఊరేగింపులో పాల్గొన్నారు. నాలుగు రోడ్ల కూడలిలో మానవహారం నిర్వహించారు. హాజరైన ప్రజలను, కార్యకర్తలను అభిమానులను ఉద్దేశించి, నాగజగదీష్, పీలా గోవింద సత్యనారాయణ, ప్రసంగించారు. మూడు నెలలోనే వైసీపీ ప్రభుత్వం ప్రజల అభిమానాన్ని కోల్పోయిందన్నారు. ఇసుక కొరతతో సుమారు 20 లక్షల మంది రోడ్డున పడ్డారన్నారు. భవన నిర్మాణ కార్మికులు దాని అనుబంధ సంస్థల కార్మికులు పనులు లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. నూతన పాలసీ ప్రకటించే వరకు ఇసుకను అందుబాటులో లేకుండా కృత్రిమ కొరతను సృష్టించి, సొమ్ము చేసుకుంటున్నారని విమర్శించారు. ఎన్ని ఆందోళనలను చేస్తున్న ప్రభుత్వంలో చలనం లేదన్నారు. అవినీతికి పెద్ద ఎత్తున పాల్పడుతున్నారని విమర్శించారు. ఎంతో మందికి ఉపయోగంగా ఉండే అన్నా క్యాంటిన్లను మూసి వేయడం ఎంతవరకు సమంజసం అని నిలదీసారు. వెంటనే అన్నా క్యాంటిన్లను తెరిపించాలని డిమాండ్ చేసారు. కార్మికుల సంక్షేమమే ధ్యేయమి చెప్పుకున్న ప్రభుత్వం వారి నడ్డి విరిస్తుందన్నారు. ఒక్క అవకాశం ఇవ్వండంటూ అధికారంలోకి వచ్చిన జగన్మోహన్‌రెడ్డి ప్రజలను వంచిస్తున్నారని విమర్శించారు. అలాగే సిపిఐ, సిపిఎం నాయకులు, వైఎస్ఆర్ కాంగ్రెస్‌పార్టీ పాలనపై ధ్వజమెత్తారు. అనంతరం ఊరేగింపుగా ఆర్డీవో కార్యాలయానికి వెళ్లి వినతిపత్రం అందజేశారు. ఈకార్యక్రమంలో సిపిఐ నాయకులు వైఎన్‌భద్రం, కోరిబిల్లి శంకరరావు, కోన లక్ష్మణ్, దంతులూరి రాజాబాబు, బిఎస్ ఎంకే జోగినాయుడు, రాపేటి రామ్‌కుమార్, కాయల మురళీ, కొణతాల రత్నకుమారి, కొణతాల శ్రీనివాసరావు, గుత్తా ప్రభాకరచౌదరీ, కోట్ని రామకృష్ణ, వియ్యపు సింహాచలం, మాజీ కౌన్సిలర్లు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, పార్టీ నాయకులు, అభిమానులు, తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## పండ్ల వర్తక సంఘం సభ్యుల సమస్యలు పరిష్కరిస్తా : ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ




చోడవరం : చోడవరంలో పండ్ల వర్తక సంఘం సభ్యుల సమస్యలు పరిష్కరించేందుకు తన వంతు కృసి చేస్తానని స్థానిక ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ అన్నారు. పట్టణంలోని హార్డింజ్ రెస్ట్ హౌస్ ఆవరణలో శుక్రవారం పండ్ల వర్తక సంఘం సభ్యుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పండ్ల వర్తక సంఘం అధ్యక్ష, కార్యదర్శులు బంగారు అర్జునరావు, ఆబోతుల శ్రీనివాసరావు, గౌరవ అధ్యక్షులు బొర్రె కనకరాజు తదితరులు ఎమ్మెల్యేను సత్కరించారు. ఈ సందర్భంగా పలువురు వై.సిపీలో చేరారు. ఈ కార్యక్రమంలో పండ్ల సంఘం ఉపాధ్యక్షులు నౌడు శ్రీనివాసరావు, ట్రెజరర్ అప్పికొండ పద్మ,వై.సిపి నాయకులు పినబోయిన అప్పారావు యాదవ్,బొడ్డేడ సూర్యనారాయణ, మూడెడ్ల శంకర్‌రావు, బొడ్డు శ్రీరామమూర్తి, ఓరుగంటి నెహ్రూ,దొండా రాంబాబు,కలగర్ల శేషు, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

CHANGE OF NAME
I, Nimmadala Sunitha
W/o Nimmadala bhaskara rao
Door No. 71-31-801
Kranthinagar, gandhigram
Malkapuram, VISAKHAPATNAM AP
Do hereby declared that
Changed my old name
Nimmadala Sunitha
w/o Nimmadala bhaskara rao
to New name
NIMMADALA SUNITHA DEVI
w/o Nimmadala bhaskara rao
I request all to consider
my name
NIMMADALA SUNITHA DEVI
w/o Nimmadala Bhaskara Rao

## గోవాడ షగర్స్‌లో దుర్గాదేవికి విశేష పూజలు



చోడవరం : మండలంలోని గోవాడ షుగర్ ఫ్యాక్టరీ కర్మాగారంలో దుర్గాదేవి అమ్మ వారికి శ్రావణ మాసం ఆఖరి శుక్రవారం విశేష పూజలు నిర్వహించారు. ఫ్యాక్టరీ అధికారులతో పాటు షుగర్ ఫ్యాక్టరీ వర్కర్సు యూనియన్ నాయకులు శరగడం రాము నాయుడు, ఫ్యాక్టరీ కార్మికులు పూజలో పాల్గొన్నారు. అనంతరం కార్మికులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

## ఘనంగా మాజీ ఎమ్మెల్సీ జన్మదిన వేడుకలు



కోటవురట్ల : కోటవురట్ల మండలం తంగేడు గ్రామంలో శుక్రవారం మాజీ ఎమ్మెల్సీ డి.వి.సూర్యనారాయణరాజు జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. కార్యకర్తలు, నాయకులు ఏర్పాటు చేసిన భారీ కేక్‌ను ఆయన కట్ చేశారు. సుమారు 1000 వరకు చీరలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల వైసిపి అధ్యక్షులు పైల రమేష్, వైసిపి పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## వైఎస్ఆర్ పింఛను కానుక నిధులు రూ.85.11 కోట్లు విడుదల

శ్రీకాకుళం : జిల్లాలో వైఎస్ఆర్ పింఛను కానుక ద్వారా సెప్టెంబరు నెలలో పింఛనుదారులకు అందించేందుకు ప్రభుత్వం రూ.85.11 కోట్లు విడుదల చేసింది. ఈ నిధులను అన్ని మండలాల ఎంపీడీవోలు, పురపాలకసంఘాల కమిషనర్ల బ్యాంకు ఖాతాలకు డీఆర్‌డీఏ అధికారులు గురువారం జమ చేశారు. వారు ఆ నిధులను డ్రా చేసి పింఛను పంపిణీ చేసే సిబ్బందికి అందించనున్నారు. పింఛనుదారులు వచ్చే నెల 1వ తేదీ నుంచి 6వ తేదీ లోగా పింఛన్లు పొందాలని కోరారు.

# తెలుగు మాధ్యంలో చదివినవారికి రిజర్వేషన్లు అవసరం...

## 'తెలుగుభారతి' డిమాండ్




అమలాపురం : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఇంటర్మీడియట్ వరకూ తెలుగు మాధ్యమంలో చదివిన వారికి ఉద్యోగ నియమకాల్లో రిజ ర్వేషన్ల్ కచ్చితంగా వర్తింపజేసి తెలుగుబాషా భివృద్ధికి పూర్తి స్థాయిలో రాష్ట్ర ప్రభుత్వమే చర్యలు తీసుకోవాలని గురువారం రాత్రి స్థానిక శ్రీలక్ష్మీ నిలయం భవనంలో "తెలుగు భారతి" సాహితి, సాంస్కృతిక సేవాసంస్థ ఆధ్వర్యలంఓ జరిగిన తులుగుభాషా దినోత్సవం, వ్యవ హారికాంధ్ర భాషోధ్యమ 'కులపతి' గిడుగు రామ్మూర్తి పంతులు156వ జయంతి సంయుక్త సభ డిమాండ్ చేసింది. సభకు సాహితివేత్త ఆచార్య శ్రీపాద రామకృష్ణ అధ్యక్షత వహించి తెలుగుభాష మను గడకై వివరిస్తూ ప్రభుత్వం భాషాభివృద్ధికి చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ముఖ్య అతిధిగా పాల్గొన్న 'సాహితీ వ్యాఖ్యాత' మారేపల్లి యజ్ఞనారాయణ తనప్రసంగంలో తెలుగు భాష పరిరక్షణకు ప్రజలు, ప్రభుత్వం బాధ్యత వహించాలని పిలుపు నిచ్చారు. విశ్రాంత తెలుగు పండిలు తోపల్లె ప్రభాకరం సభలో తెలుగు భాషాదైభవాన్ని పూర్వకవుల రచనా వైశిష్టాన్ని వివరిస్తూ జోహార్లు అర్పించారు.సభలో తెలుగు తల్లికి నీరాజలర్పించిన కవియిత్రులు పోలిశెట్టి అనంతలక్ష్మీదేవి, ఆకొండి ధన్వంతరి, వేదనపట్ల సాయిలక్ష్మీ, యాళ్ళ అంజలి,శ్రీగిరి పద్మవతి, కవులు శిష్టా సత్యరాజేష్, అశ్వని, రంగ, సినీ,టి.వి కళా కారులు కె.భద్రాజీ, సధాకరరావు, కృష్ణమెహన్, చల్లా రమణ, ఎన్.దుర్గారావు, స్థానిక హెడ్‌పోస్ట్‌మాస్టార్ ఎన్.ప్రబుత్తులను తెలుగు భారతి సంచాలకులు, సాత్రికేయులు బి.యస్.రాజు శాలువలతో ఘనంగా సన్మానించారు.

### ఉచిత ఇసుక విధానం తీసుకురావాలంటూ

# చోడవరంలో టీడీపీ శ్రేణుల భారీ నిరసన ర్యాలీ




చోడవరం-రాష్ట్ర ప్రభుత్వం తక్షణం ఉచిత ఇసుక విధానం తీసుకురావాలంటూ చోడవరం పట్టణంలోని టీడీపి. శ్రేణులు శు క్ర వారం నిరసన ర్యాలీ నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే కె.ఎస్.ఎన్.ఎస్.రాజు ఆధ్వ ర్యంలో స్థానిక టీడీపీ కార్యాలయం నుంచి కొత్తూరు జంక్షన్, ఆర్‌టిసి కాంప్లెక్సు, పాత బస్టాండ్ మీదుగా ప్రభుత్వ డిగ్రీ కళాశాల వరకు భారీ ర్యాలీగా వెళ్ళి అనంతరం స్థానిక తహసీల్దారు కార్యాలయం అధికారులకు వినతి పత్రం అందచేశారు. ఇసుక కొరత వలన భవణ నిర్మాణ కార్మికులు, నూతన గృహాలు, వ్యాపార సముదాయాల నిర్మా ణాలు ఆగిపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ప్రభుత్వం తక్షణం ఉచిత ఇసుక పాలసీ తీసుకురావాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో షుగర్ ఫ్యాక్టరీ మాజా ఛైర్మన్ గూనూరు మళ్ళు నాయుడు, మాజీ ఎంపిపీ పెదబాబు, మాజీ జెడ్.పీటీసీ సభ్యులు కనిశెట్టి మత్స్యరాజు, మాజీ వైస్ ఎంపీపీ. భూతనాధు నానికుమార్,టీడీపీ మండలపార్టీ అధ్యక్షులు బొడ్డేడ నాగ గంగాధర్, విజయరామరాజుపేట టీడీపీ నాయకులు దొడ్డి కిశోర్, కోటవీధి, యడ్లవీధి టీడీపీ నాయకులు ముడుసు గోవింద, మాదిరెడ్డి జోగినాయుడు, బొబ్బిలి ఈశ్వరరావు, రావాడ శ్రీనివాస్, పట్నాల సంతోష్, గొర్లె సరోజినీ, మహిళా నాయకురాలు నడుపూరి లక్ష్మీభాయ్, ఆయా గ్రామాల టీడీపి నాయకులు జెట్టి మాణిక్యం, వేగి శ్రీనివాసరావు, శరగడం శ్రీనివాసరావు, ఆడారి వెంకట అప్పా రావు, నాగులాపల్లి సూర్యనారాయణ, చిన్నా,దేవరపల్లి వెంకట అప్పారావు,వియ్యపు సన్నిబాబు, లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

# 180 కేజీల గంజాయి పట్టివేత


పట్టుబడిన గంజాయి నిందితులతో టాస్క్‌పోర్సు పోలీసులు

నర్సీపట్నం : దారకొండ నుండి కర్ణాటక రాష్ట్రంకు అక్రమంగా తరలిస్తున్న 180 కేజీల గంజాయిని ఎక్సైజ్ టాస్క్‌పోర్సు శు క్రవారం పట్టుకున్నారు. అకస్మిక తనిఖీల్లో భాగంగా హోండా సిటీ కారులో నాలుగు బ్యాగుల్లో ఈ గంజాయిని అక్రమంగా తరలిస్తుండగా చింతపల్లి నర్సీపట్నం రోడ్డులోని రోలుగుంట మండలం పెదపేట జంక్షన్ వద్ద గంజాయి పట్టుబడింది.

కర్ణాటక రాష్ట్రంకు చెందిన రవీంధ్ర తాతారావు(29), తిమ్మల్క్ మాణిక్యాలరావుజాదవ్(21), మనహర్‌రాఠోద్ (20),ఎ.కృష్ణ (23)లను అరెస్టు చేసి మూడు సెల్ ఫోన్లు, 7500 నగదు వారి వద్ద నుంచి స్వాధీనం చేసుకున్నామని టాస్క్ ఫోర్సు సిఐ కె.కామే శ్వరరావు, ఎస్సై ధర్మారావు తెలిపారు.

# మట్టి వినాయకున్నే పూజిద్దాం!

### పర్యావరణహిత వినాయకచవితి జరుపుకుందాం! : స్వాతి ఎండి రమేష్‌రెడ్డి



విశాఖపట్నం: ప్లాస్టర్ ఆఫ్ పారిస్, వివిధ కెమికల్స్, రంగులతో కూడిన వినాయక విగ్రహాలు కాకుండా, కేవలం మట్టితో చేసిన వినాయక విగ్రహాలతో పర్యావరణహిత వినాయకచవితి ఆనందంగా జరుపుకుందామని స్వాతి ప్రమోటర్స్ ఎం.డి.రమేష్‌రెడ్డి సూచించారు. శుక్రవారం నగరంలో అక్కయ్యపాలెం దాలిరాజ్ సూపర్ మార్కెట్ దరి ప్రజ్వలవాణి స్వచ్ఛంద సంస్థలో (వెల్ఫేర్ సొసైటీ) మరియు కృష్ణా కాలేజి దగ్గర అక్షరా స్కూల్‌లో మట్టి వినాయక ప్రతిమలు మరియు పూజా విధాన పుస్తకాలను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రమేష్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మన పర్యావరణ పట్ల చాలా శ్రద్ధ వహించాలని, ప్లాస్టర్ ఆఫ్ పారిస్, కెమి కల్స్‌తో కూడిన విగ్రహాలను పూజించి నిమ జ్జనం చేయడం ద్వారా నీటి వనరులు కలు షితం అవు తాయని, తద్వారా వాతావరణంలో పెను మార్పులు వచ్చి ఉపద్రవాలు సంభవిస్తా యని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కావున ప్రతి ఒక్కరూ కేవలం మట్టితో తయారుచేసిన విగ్రహాలను పూజించి పర్యా వరణ హిత వినాయకచవితి జరుపుకుందామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రజ్వలవాణి వెల్ఫేర్‌సొసైటీ అధ్యక్షురాలు డా.సుచిత్ర, స్వాతి సంస్థ డిజిఎం పూర్ణిమ తదితరులు పాల్గొన్నారు.

## లక్ష్మీపురంలో విద్యార్థులకు మట్టి విగ్రహాలు పంపిణీ


విద్యార్థులకు మట్టి విగ్రహాలు పంపిణీ చేస్తున్న ప్రధానోపాధ్యాయులు గొల్లు శ్రీనివాసరావు

చోడవరం : మండలంలోని లక్ష్మీపురం మండల పరిషత్ ప్రాధ మిక పాఠవాలలో విద్యార్థులకు శుక్రవారం మట్టి విగ్రహాలను పంపిణీ చేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు గొల్లు శ్రీనివాస రావు ఆధ్వర్యంలో పర్యావరణానికి ఎలాంటి హాని కలిగించని మట్టి విగ్రహాలను విద్యార్థులతో చేయించి అనంతరం పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులకు ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లి దండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## నేడు వన మహోత్సవ కార్యక్రమం

నర్సీపట్నం : నర్సీపట్నం అల్లూరి సీతారామరాజు డిగ్రీ కళాశాల ఎదురుగా గల డిఎఫ్ఒ కార్యాలయ ఆవరణలో శనివారం ఉద యం 10 గంటలకు వన మహోత్సవ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నర్సీపట్నం డిఎఫ్ఒ వేణుగోపాలరావు తెలిపారు. శుక్రవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి నర్సీపట్నం ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకరగణేష్, ఆర్డీవో ఆర్.గోవిందరావు, మున్సిపల్ కమిషనర్ తోట కృష్ణవేణి, ఇతర అధికారులు పాల్గొం టారన్నారు. కావున ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

# కుటుంబసమేతంగా భైరవస్వామి అప్పన్నను దర్శించుకున్న ముత్తంశెట్టి శ్రీనివాస్



సింహాచలం : సింహగిరిపై వేంచేసి ఉన్న సింహాద్రి అప్పన్నని మరియు సింహాద్రి అప్పన్న అనుబంధ ఆలయం భైరవ స్వామిని శుక్రవారం నాడు రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు దంపతులు తమ కుటుంబ సభ్యులు తదితరులు దర్శించుకున్నారు. కార్యనిర్వ హణాధికారి ఎం వెంకటేస్వరరావు ఘనస్వాగతం పలికారు. అర్చకస్వాములు పూర్ణకుంభంతో ఆహ్వానం పలికారు. కప్పస్థంభం ఆలింగనం అనంతరం స్వామి వారికి తమగోత్ర నామాలతో ప్రత్యేక పూజలు చేయించారు. దర్శన అనంతరం వేదపండితులు ఆశీర్వచనం పలికారు. అధికారులు స్వామివారి శేషవస్త్రంతో సత్కరించి తీర్థప్రసాదాలు అందజేసారు.

**భైరవస్వామి వారి ఆలయం అభివృద్ధి చేయాల్సి ఉంది : మంత్రి ముత్తంశెట్టి**

దర్శనాంతరం అయన కొండక్రింద ఉన్న భైరవవాకలో కొలువై ఉన్న బైవారస్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. భైరవ స్వామి సింహాద్రిఅప్పన్న క్షేత్ర పాలకుడని అందుచేత ఆలయాన్ని అభివృద్ధి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అనంతరం అయన మాట్లాడుతూ అటవీశాఖ వారికి సింహాచలం దేవస్థానం వారు భూమికి భూమి ఇస్తే ఆలయం అభివృద్ధి అవుతుందన్నారు. ఇందుకు సంబంధించి కార్యాచరణ త్వరలోనే రూపుదిద్దు కుంటుందన్నారు.



మట్టి వినాయకుల పంపిణీలో పాల్గొన్నారు . రోజురోజుకూ పెరుగుతున్న జనాభా, వాహన, అన్ని రకాల కాలుష్యాలతో పర్యా వరణం కలుషితమై జీవకోటి మనుగడకు ముప్పు వాటిల్లే అవకాశం ఉందని అందుకు ప్రతి ఒక్కరూ పర్యావరణ పరి రక్షణకు బాధ్యతతో ముందుకు రావా లని అన్నారు. వాహ నాలు, ప్లాస్టిక్ వ్యర్థాలతో కాలుష్యం పెరిగి పర్యా వరణానికి ముప్పు ఏర్పడుతుందన్నారు. దీంతో ప్రస్తుతమే కాకుండా రాబోయే తరాలకు సైతం పర్యావరణం కలుషితమై అందకుండా పోతుందన్నారు. ఇందుకు ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణ తమ బాధ్యత అని తెలుసుకొని రక్షించాలని కోరారు. ప్రతి ఒక్కరూ చెట్లు నాటాలని, కాలుష్యాన్ని నివారించాలన్నారు. అప్పుడే వర్షాలు సైతం విరివిగా కురిసి పర్యావరణానికి ముప్పు వాటిల్లే అవ కాశం ఉండదని తెలిపారు. ఆయన వెంట నగర వైకాపా నాయకులు నడింపల్లి రామరాజు, 72వ వార్డు వైకాపా అధ్యక్షులు కొలుసు ఈశ్వరరావు, గంట్ల కిరణ్, ఎర్ర వరంబాబు, కర్రి సత్తిబాబు, దాసరి కనకరాజు, రచ్చ ఆనంద్ వర్మ ఇతర వైసీపీ నాయకులు అయనవెంట ఉన్నారు.

### ఘనంగా డీసీసీబి ఛైర్మన్ సుకుమార్ వర్మ (తేజ)

## జన్మదిన వేడుకలు



అచ్యుతాపురం : మండల కేంద్రమైన అచ్యుతాపురం లో శని వారం డీసీసీబి చైర్మన్ సుకుమార్ వర్మ (తేజ) జన్మదిన వేడు కలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్బంగా మండల వైసీపీ నాయ కులు స్థానిక ఇంటిగ్రేటెడ్ ఆశ్రమ పాఠశాలలో కేక్ కట్ చేసి విద్యా ర్థులకు పుస్తకాలు,పెన్‌లు పంపిణి చేశారు. ఈ కార్య క్రమంలో వైసిపి జిల్లా రూరల్ యువజన అధ్యక్షులు లాలం రాంబాబు, వైసీపీ నాయకులు మాజీ ఎంపీపీ చేకూరి శ్రీనివాసు రాజు, పిన్నం రాజు వాసు, నర్మాల కుమార్, వడిశల శ్రీనివాసరావు, ద్వారపురెడ్డి బాబ్జి, డిఎస్ఎన్.రాజు (బుజ్జి), వాసుపల్లి శ్రీని వాసురావు, పోల వరపు పారునాయుడు, గంగిరి రవి, పిఎస్‌టి పట్నాయిక్ అధిక సంఖ్యలో వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### విశ్రాంతి మున్సిపల్ కమిషనర్ లంక రామారావుకి మాతృవియోగం

యానాం : భీమ్ నగర్ గ్రామానికి చెందిన విశ్రాంతి మున్సిపల్ కమిషనర్ లంక రామారావు మాతృమూర్తి లంక కాంతమ్మ( 80) అనారోగ్యంతో కాకినాడలో ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందారు లంక కాంతమ్మ కుటుంబ సభ్యులకు పుదుచ్చేరి ఆరోగ్య శాఖ మంత్రి మల్లాడి కృష్ణారావు, తదితర నాయ కులు, అధికారులు ప్రగాఢ సంతాపం తెలియజేశారు.

### సత్యసాయి నారాయణ సేవకు రూ.లక్ష విరాళం

శ్రీకాకుళం : నగరంలో న్యూకాలనీలో సత్యసాయిమందిరంలో జాతీయ నారాయణ సేవకు నగరానికి చెందిన వ్యాపారవేత్త జామి జనార్దన రూ.లక్ష నగదు విరాళం ఇచ్చారు. న్యూకాలనీ సత్యసాయి మందిరం కన్వీనర్ కోరాడ షణ్ముఖరావుకు నగదు అందజేశారు.

# జిల్లాలో మైనింగ్ అక్రమాల పై కఠిన చర్యలు

### మైనింగ్ ఆక్రమణలు అరికట్టడానికి వినూత్న చర్యలు. - మైనింగ్ ఏజెన్సీలు ఇయండి రూపంలో నగదు జమ చేయాలి

### రామేశంపేట మైనింగ్ భూముల్లో మొక్కలు నాటిన కలెక్టరు డి.మురళిధర్ రెడ్డి, జాయింట్ కలెక్టర్ లక్ష్మి

పెద్దాపురం : జిల్లాలో మైనింగ్ అక్రమణలపై కఠిన చర్యలు తీసుకోనున్నట్లు జిల్లా కలక్టర్ డి.మురళీ ధర్ రెడ్డి చెప్పారు. గురువారంనాడు పెద్దాపురం మండలం రామేశంపేటలో మైనింగ్ చేపట్టిన అసైన్డ్ భూముల్లో మొక్కలు నాటే కార్యక్రమాన్ని కలక్టర్, జాయింట్ కలక్టరు ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో భూమి లెవిలింగ్ పేరిట మైనింగ్ అక్రమాలు జరుగుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. ఇటువంటివి సహించేది లేదని స్పష్టం చేశారు. ఈ మేరకు మైనింగ్ శాఖ అధికారులు కూడా కఠినంగా వ్యవహరించాలని కలెక్టరు ఆదేశించారు. భూమి లెవిలింగ్ పేరిట మైనింగ్ చేపట్టి, పరమితులకు మించి, మైనింగ్ చేపట్టడం మూలంగా లబ్దిదారులు నష్టపోవడంతో పాటు పర్యావరణానికి కూడా చేటుకలుగు తుందన్నారు. ఇక నుండి జిల్లాలో ఇచ్చే మైనింగ్ అనుమతులను 'నిబంధనలు ఖచ్చితంగా పాటించాలని మైనింగ్ అధికారులకు కలక్టర్ సూచించారు. మైనింగ్ అక్రమాలు జరిపి ఎస్.సి., ఎస్.టి. లబ్దిదారులకు నష్టం కలిగిస్తే వారిపై లబ్దిదారుల ద్వారా ఎస్.సి., ఎస్.టి. అత్యాచార చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. పెద్దాపురం మండలం రామేశంపేటలో సర్వే నెం. 19లో 823 ఎకరాలను 1983-95ల మధ్య 534 మంది లబ్దిదారులకు 717 ఎకరాలు అసైన్డ్ చేయడం జరిగిందన్నారు. ఈ భూములను లబ్దిదారులు మైనింగ్ లీజ్ కు ఇచ్చారని, దీని ద్వారా లబ్దిదారులకు ప్రయోజనం చేకూర్చబడలేదన్నారు. అదే విధంగా సద్వినియోగం కాబడ లేదన్నారు. ఈ భూముల్లో పరిమితికి మించి త్రవ్వకాలు జరిగినట్లు స్పష్ట మవుతుందని, ఇటువంటి చర్యలు పునరావృత్తం కాకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటు న్నామన్నారు. లబ్ది దారులకు కేటాయించిన భూము లను లెవెలింగ్ కోసం అనుమతులు కోరు తున్నారని, ఇటువంటి భూముల్లో ఇకనుండి మైనింగ్ చేయడానికి ఇయండి రూపంలో నగదు జమ చేయాల్సి ఉంటుందన్నారు. ఈ నగదును నిబంధనల మేరకు అవసరమైన పనులు చేపట్టిన తరువాత మాత్రమే చెల్లించడం జరుగు తుందన్నారు. జిల్లాలో మైనింగ్ పనులను ఆపేది లేదని, అభివృద్ధి కోసం వాటిని కొన సాగిస్తూ వీటిని క్రమబద్ధీ కరిస్తా మన్నారు. రామేశంపేటలోని మైనింగ్ భూముల్లో మామిడి,. జీడిమామిడి మొక్కలు నాటాలని కలెక్టర్ లబ్దిదారులకు సూచించారు. వీటికి అవసరమైన ప్రోత్సాహకాలను ఎస్.సి. కార్పొరేషన్ మరియు ఉద్యాన శాఖల ద్వారా మంజూరు చేస్తామన్నారు. అదే విధంగా ఈ భూములని సర్వే కూడా త్వరి తగతిన చేపడతామని కలెక్టర్ తెలిపారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ తాత్కాలిక ప్రయోజనం ఆశించకుండా దీర్ఘ కాలిక అవసరాలను గుర్తించి, తమ భూములను అభివృద్ధి చేసుకోవాలన్నారు. ప్రభుత్వం ఏ ఉద్దేశంతో భూములు ఇచ్చిందో ఆ లక్ష్యాలు నెరవేరే విధంగా లబ్దిదారులు ముందుకు రావాలన్నారు. త్వరలో భూములు సర్వే చేయించి, లబ్దిదారులకు కేటాయించడం జరుగు తుందని జేసి తెలిపారు. ఈ క్వారీ భూముల్లో కలక్టర్, జయింట్ కలక్టర్లు స్థానిక ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులతో కలిసి జీడిమామిడి మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో మైనింగ్ ఆసిస్టెంట్ డైరెక్టర్ ప్రసాద్, పెద్దాపురం ఆర్.డి.ఓ. మల్లిబాబు, పిడి,ఎపిఎంఐపి మోహన్ రావు, సమాచార శాఖ డిడి ఎం.ఫ్రాన్సిస్, హార్టీ కల్చర్ ఆఫీసర్ సుజాత, తదితరులు పెద్ద ఎత్తున లబ్దిదారులు పాల్గొన్నారు.



# భీమిలి టీడీపీ ధర్నా



భీమునిపట్నం: టిడిపి పార్టీ భీమిలి నియోజకవర్గం ఇన్ ఛార్జ్ సబ్బం హరి ఆధ్వర్యంలో ఇసుక విధానంపై ప్రభుత్వ వైఖరికి నిరసనగా భీమిలి పురవీధుల్లో ర్యాలీ గా వెళ్లి తహసీల్దార్ కె వి ఈశ్వరరావు కి వినతిపత్రం అందజేసారు. ఈ సందర్భంగా తహశీల్దార్ కార్యాలయం ఎదురుగా ఏర్పాటు చేసిన తెలుగుదేశం శిబిరంలో సబ్బం హరి మాట్లాడుతూ కొత్త ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఇసుకపై కొత్త విధానం తీసుకొస్తామని చెప్పి అధికారంలోకి వచ్చి మూడు నెలలు అవుతున్నా ఎటువంటి నిర్ణయం తీసుకోక పోవడంతో ఎంతోమంది భవన కార్మికులు రోడ్డున పడ్డారని సబ్బం హరి అన్నారు. రేటు ఎంతో నిర్ణయిస్తే మేమె కొనుకుంటాము మాకు ఎటువంటి రాయితీలు అక్కరలేదని చెపుతున్న ఇసుక ఇవ్వని ప్రభుత్వం ఒకే ఒక ప్రభుత్వం ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వమని అన్నారు. ఇలాంటి చేతకాని పనికమాలిన ప్రభుత్వం నా 30 సంవత్సరాల రాజకీయ జీవితంలో ఎప్పుడూ చూడలేదని తెలిపారు.రాష్ట్రం లో అసంఘటిత కార్మిక వర్గం అంతా ఆకలితో అలమటిస్తున్నా ప్రభుత్వం నిర్ణయం తీసుకోలేక పోవడం వారి అసమర్థత కు నిదర్శనంగా కనిపిస్తోందని అన్నారు. దీనిపై నిర్ణయం తీసుకోక పోవడానికి ఏదేమైనా కాశ్మీర్ సమస్యా. అని ఎద్దేవా చేసారు. జగన్ ప్రభుత్వం లో అతని కి ఎదురుగా అతని పార్టీ మంత్రులు సైతం మాట్లాడలేని పరిస్థితి చూస్తుంటే ఆతని నియంత పాలన అని అర్థం అవుతుందని అన్నారు.

తెదెపా నాయకులు ఇసుక మాఫియా చేసారని ఆరోపణలు చేసిన వైసిపి ఇప్పుడు కార్మిక వర్గానికి సమాధానం చెప్పాలని డిమాండ్ చేసారు. ఇసుక మాఫియా తేదెపా చేసిందని ప్రజలను మభ్యపెట్టి ఓట్లు కూడగట్టుకున్న వైసిపి నిజ స్వరూపం తెలిసి ఆ పార్టీకి ఓట్లు వేసిన ప్రజలు ఇప్పుడు తమ చెప్పులతో తామే కొట్టుకున్నట్లు అయ్యిందని అంటున్నారన్నారు. కేవలం ఇసుక పైన నిర్ణయం తీసుకోడానికే మూడు నెలల సమయం తీసుకున్న ఈ ప్రభుత్వం ఇక మిగిలిన పనులకు ఎన్ని సంవత్సరాల సమయం తీసుకుంటుదోనని ఎద్దేవా చేశారు. ఇకనైనా మేల్కొని ప్రజామోదయోగ్యమైన పనులు చేయాలని సూచించారు. జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి గా ఆంధ్ర ప్రజల కలల రాజధాని అమరావతి, పోలవరం ప్రాజెక్టులను ఆపివేసి చరిత్ర హీనులుగా మిగిలిపోయారని, నిరుపేదలు రోజులో 15 రూపాయలకే మూడుపూటలా రుచికరమైన ఆహారం తింటున్న అన్నా క్యాశీటీన్ లను నిలుపుదల చేసి పేదవారి పొట్టన కొట్టారని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రివర్యులు ఆర్.ఎస్.డి.పి.అప్పలనరసింహ రాజు, మాజీ శాసనసభ్యులు కర్రి సీతారాం, తెలుగుదేశం పార్టీ భీమిలి డివిజన్ అధ్యక్షులు గంటా నూకరాజు, జిల్లా పసుగణాభివృద్ధి చైర్మన్ గాడు వెంకటప్ప డు, మాజీ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కోరాడ నాగభూషణరావు, భీమిలి మండల అధ్యక్షులు డి.ఎ. ఎన్. రాజు, మాజీ భీమిలి మండలాధ్యక్షులు యరబాల కృష్ణవేణి,జిల్లా తెలుగుమహిళా అద్యక్షురాలు కురిమిన.లీలావతి, బమ్మిడి. ఉమ పద్మనాభం అధ్యక్షులు కాళ్ళ నగేష్, జెడ్.పి.టి.సి.సరగడ అప్పారావు, పాసర్ల ప్రసాద్, ఆనందపురం మాజీ మండలాధ్యక్షులు కోరాడ రాజబాబు, ఆనందపురం అధ్యక్షులు బి.ఆర్.బి.నాయుడు,మాజీ కౌన్సిలర్ చురకల రమణ,రవ్వ.వెంకరావు, గిడుతూరి శ్రీనివాసరావు,కొక్కిరి అప్పన్న తదితరులు పాల్గొన్నారు .

# ఘనంగా వనదుర్గమ్మవారి ఆలయంలో చండీ హోమం



అన్నవరం: తూ.గో.జిల్లా ప్రముఖ పుణ్య క్షేత్రము అన్నవరం శ్రీ వీరవెంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానంలో వనదేవతగా పూజలు అందుకొంటున్న వనదుర్గమ్మవారి గుడిలో శుక్రవారం ఘనంగా చండీ హోమం నిర్వహి ంచారు. ఉదయం 9గం.లకు విఘ్నేశ్వరుని పూజా,పుణ్యవచనం అమ్మవారికి మూల,మంత్ర జపములు చండీ సప్తపతి పారాయణములు నిర్వహించారు. 11గం.లకు పూర్ణహుతి గావించారు.పూజా కార్యక్రమాలు కొండవీటి. సత్యనారాయణ ఆద్వర్యంలో వెంకటరావు, కోంపెల్ల.మూర్తి, కుచిబోట్ల.ప్రసాద్ మరియు వేదపండితులు, అర్చకులు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఈవో వి.త్రినాథరావు, ఏసి రమేష్ బాబు,ఏఈవో ప్రసాద్,దేవస్థానం మాజీ పాలకమండలి సభ్యులు కొత్త.కొండబాబు,ఆలయ సిబ్బంది,గ్రామ ప్రజలు,భక్తులు పాల్గొన్నారు. వేదపండితుల వేదాశీస్సులు అనంతరం భక్తులకు తీర్థ,ప్రసాదాలు అందజేసారు.

# కనకదుర్గమ్మవారి ఆలయంలో ఘనంగా లలితా సహస్ర హోమం



అన్నవరం: తూ.గో.జిల్లా ప్రముఖ పుణ్యక్షేత్రము అన్నవరం శ్రీ వీరవెంకట సత్యనారాయణ స్వామివారి తొలిపావాంచ వద్ద కొలువైయున్న కనకదుర్గమ్మవారి ఆలయంలో శ్రావణమాసము ఆఖరి శు క్రవారం అమావాస్య పర్వదినాన్ని పురష్కరించుకొని శుక్రవారం లలితా సహస్రహోమం అత్యంత ఘనంగా నిర్వహించారు. ఉదయం 10 గంటలకు పండితులు గణపతి పూజతో కార్యక్రమాన్ని ప్రారంభించి అనంతరం హోమ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు.11 గంటలకు పూర్ణహుతి నిర్వహించారు.వేద పండితులు వేదాశీస్సులు అనంతరం భక్తులకు తీర్థ,ప్రసాదాలు అందజేశారు.ఈ కార్యక్రమంలో దేవస్థానం ఈవో వి.త్రినాధరావు,ఏసి రమేష్ బాబు,ఆలయ పర్యవేక్షణ అధికారి పోల్నాటి. లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.పూజా కార్యక్రమాలను అర్చకులు చల్లపల్లి.ప్రసాద్ శర్మ,యడవల్లి.చంటి,నగేష్,ఆలయ అర్చకులు ప్రయాగ.రాంబాబు తదితరులు నిర్వహించారు.

# అన్నవరం గ్రామ దేవతలను సందర్శించిన ఎమ్మెల్యే పర్వత



అన్నవరం: తూ.గో.జిల్లా ప్రముఖ పుణ్యక్షేత్రము అన్నవరం గ్రామ దేవతలైన శ్రీశ్రీశ్రీ నేరేళ్ళమ్మ అమ్మవారిని మరియు శ్రీశ్రీశ్రీ మరిడమ్మ అమ్మవారిని శ్రావణమాసము అమావాస్య పర్వదినాన్ని పురష్కరించుకొని అక్కడ జరుగుతున్న నిత్య అన్నదాన కార్యక్రమానికి హజరైన ప్రత్తిపాడు ఎమ్మెల్యే పర్వత.పూర్ణచంద్ర ప్రసాద్ అమ్మవారిని దర్శించి తీర్థ,ప్రసాదములు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం టెంపుల్ ఇన్ స్పెక్టర్ పోల్నాటి. లక్ష్మీనారా యణ, కాకినాడ పార్లమెంటరీ వైసీపీ ఎస్సీ సెల్ విభాగం అధ్యక్షుడు శెట్టిబత్తుల.కుమార్ రాజా. పట్టణ వైయస్ఆర్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాయవరపు భాస్కరరావు, స్థానిక వైసీపీ నాయకులు అల్లాడ సూరిబాబు, బిఎస్వీ ప్రసాద్, బండారు. అర్జునరావు, ధారా వెంకట రమణ, తాటిపాక కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ విఘ్నేశ్వర స్వామివారిని దర్శించుకున్న ఎంపి, ఎమ్మెల్యే



అమలాపురం: తూర్పు గోదావరి జిల్లా అయినవిల్లి మండలం మరియు గ్రామములో వేంచేసియున్న శ్రీ విఘ్నేశ్వర స్వామి వారిని అమలాపురం పార్లమెంటరీ సభ్యురాలు శ్రీమతి చింత అనురాధ , ముమ్మిడివరం నియోజకవర్గ ఎమ్మెల్యే పొన్నాడ సతీష్ కుమార్‌లు దర్శించుకుని స్వామివారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. వీరికి ఆలయ కార్యనిర్వహణాధికారి పి.తారకేశ్వరరావు , ప్రధాన అర్చకులు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు ఈ సందర్భముగా ఎమ్మెల్యే పొన్నాడ సతీష్ కుమార్ 1116 కొబ్బరి కాయలు మొక్కుబడిని స్వామి వారికి సమర్పించారు. అనంతరం కార్యనిర్వహణాధికారి శ్రీ స్వామి వారి చిత్రపటమును, ప్రసాదములను, వినాయకుని మట్టి ప్రతిమలను అందజేసినారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు, కార్యకర్తలు, ఆలయ సిబ్బంది ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

# ఆకట్టుకున్న అష్టావధానం



భీమునిపట్నం: స్థానిక సాగర్ అసోసియేషన్ ఆఫ్ వాకర్స్ క్లబ్ 15 వ వార్షికోత్సవం మరియు గిడుగు రాంమూర్తి పంతులు జయంతి తెలుగు భాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం ఏర్పాటు చేసిన అష్టావధానం ఆహుతులను ఆకట్టుకుంది. స్థానిక న్యాయవాది మరియు వాకర్స్ క్లబ్ ఫౌండర్ లయన్ కోట మల్లిఖార్జున రావు ఇంటి వద్ద ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున బాషాభిమానులు మరియు సాహితీ ప్రియులు పాల్గొన్నారు. అవధాన సుధాకర బిరుదాంకితులు శతావధాని డాక్టర్ రాంభట్ల పార్వతీ శర్మ తన అవధాన పటిమ తో ప్రేక్షకులను మంత్ర ముగ్ధులను చేశారు. ఈ కార్యక్రమానికి సంచాలకులు గా బ్రహ్మశ్రీ సర్వాజోస్యుల గౌరీ శంకర శాస్త్రి వ్యవహరించారు. పృచ్ఛకులుగా మేటి తెలుగు భాషా ప్రవీణులు పాల్గొన్న ఈ అవధాన కార్యక్రమం అద్భుతంగా జరిగింది. కార్యక్రమంలో పాల్గొన్న వారికి సాగర్ అసోసియేషన్ ఆఫ్ వాకర్స్ తరపున మెమెంటో లు అందజేశారు. క్లబ్ ఫౌండర్ కోట మల్లిఖార్జున రావు పుట్టిన రోజు సందర్భంగా కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమాన్ని ఇంత అద్భుతంగా నిర్వహించినదుకు ఆయనను ఆహూతులు అభినందించారు.

### అమలాపురంలో అప్పుల బాధతో

# డాక్టర్ కుటుంబం ఆత్మహత్య





అమలాపురం: తూర్పుగోదావరి జిల్లా అమలాపురంలో ఘోర విషాదం చోటచేసుకుంది. ప్రముఖ ఆర్థోపెడిక్ డాక్టర్ కృష్ణంరాజు కుటుంబం ఆత్మహత్య చేసుకుంది. రామకృష్ణంరాజు(50), భార్య లక్ష్మీదేవి(45), కుమారుడు కృష్ణ సందీప్(25)తో సహా గురువారం రాత్రి ఆత్మహత్య చేసుకున్నారు.

ముగ్గురూ సెలైన్ ద్వారా విషం ఎక్కించుకుని ప్రాణాలు తీసుకున్నారు. ఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. డాక్టర్ ఫ్యామిలీ ఆత్మహత్యకు ఆర్థిక ఇబ్బందులే కారణంగా పోలీసులు భావిస్తున్నారు.

రియల్ ఎస్టేట్ వ్యాపారంలో పెట్టుబడులు పెట్టగా వ్యాపారంలో నష్టాలు రావడంతో ఆత్మహత్యకు పాల్పడినట్లుగా పోలీసులు అనుమానిస్తున్నారు. ఆత్మహత్యకు గల కారణాలను తెలుసుకునే దిశగా దర్యాప్తు చేస్తున్నామని డిఎస్పి మాషుమ్ భాషా తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ సిఐ సురేష్‌బాబు, రూరల్ సిఐ భీమరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

# రజకులపై దాడికి పాల్పడ్డ వారిపై చర్యలు తీసుకోవాలని జేసికి వినతి



కాకినాడ: తూర్పుగోదావరిజిల్లా కోరుకొండ మండలం నర్సాపురం గ్రామంలో గ్రామ వాలంటీర్‌గా పనిచేస్తున్న మాత సునీల ఆమె భర్త సత్తిబాబులపై దాడి చేసి, తీవ్రంగా గాయపరిచిన వారిపై చర్యలు చేపట్టాలని కోరుతూ శుక్రవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జాయింట్ కలెక్టర్ లక్ష్మీషాకు ఆంధ్ర ప్రదేశ్ చాకిరేవు రజక సంఘం ఆధ్వర్యంలో వినతిపత్రాన్ని సమర్పించించారు. గ్రామ వాలంటీర్‌గా పనిచేస్తున్న సునీలను అదే గ్రామానికి చెందిన వారు దాడి చేసి తీవ్రంగా గాయపరచడంతో భార్యాభర్తలు ఇద్దరూ రాజమంహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. దాడి జరిగి సుమారు పది రోజులైనా దాడికి పాల్పడిన వారిపై ఎటువంటి చర్యలు చేపట్టలేదని నాయకులు జాయింట్ కలెక్టర్ లక్ష్మీషాకు తెలిపారు. తక్షణమే వారిని అరెస్టు చేయాలని వారు కోరారు.అంతకుముందు జిల్లా ఎస్పీ నయీమ్ అష్మీకి వినతిపత్రం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ చాకిరేవు రజక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గుల్లపూడి పార్థసారధి, ప్రధాన కార్యదర్శి కె శివప్రసాద్, నాయకులు రాము, శ్రీనివాస్, సూరిబాబు, సత్యనారాయణ, వీరన్న, నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

# రౌడీయిజంతో పూర్ణామార్కెట్‌లో ఆశీలు కళ్లప్పగించి చూస్తున్న జివిఎంసి అధికారులు

విశాఖపట్నం: పూర్ణామార్కెట్ ప్రాంతంలో జెర్రిపోతుల ప్రసాద్ రౌడీయిజంతో దైర్జన్యంతో ఆశీలు అధికమొత్తంలో వసూలు చేస్తున్నారు. పూర్ణామార్కెట్‌లో గంపలతో మహిళలు కూరగాయాలు, పళ్ళు అమ్ముకుంటున్నారు. తోపుడుబళ్ళులో మరికొందరు జీవనభృతికై చిరువ్యాపారాలు చేసుకుంటున్నారు. వీరు సుమారు 200మంది వరకు వుంటారు. రోజంతా కష్టపడితే వాళ్ళకి వచ్చే లాభం కొంతే దీనితో కుటుంబాలు గడవడం కష్టంగా ఉంది. తప్పక బ్రతుకుతున్నారు. జెర్రిపోతుల ప్రసాద్ దౌర్జన్యంగా వారందరి వద్ద రోజు 40 రూపాయల నుండి 50 రూపాయల వరకు వసూలు చేస్తున్నారు. ఇది పచ్చి దుర్మార్గం. జివిఎంసి వారు రోజుకు 5 రూపాయలు వసూలు చేసుకోవడానికి మాత్రమే అనుమతి ఇచ్చారు. ప్రభుత్వ నిబందనల ప్రకారం కాకుండా అదికమొత్తంలో ఆశీలు వసూలు చేస్తున్నారు. ఆశీలు వసూలు కూపన్లుగాని, రశీదుగాని లేదు. ఇది ఏమిటని అడిగితే గంపలు విసిరేస్తూ బండ బూతులు తిడుతున్నారు. ప్రసాద్ పూర్ణామార్కెట్ తన సొంత జాకీరుగా ప్రవర్తిస్తున్నాడు. తన ఇష్టం వచ్చినంత ఆశీలు వసూలు చేస్తున్నారు. ఇది తగదని స్పందనలో వారంతా మొర పెట్టుకున్నారు.

# జెడ్పీ ఉద్యోగి శర్మకు తెలుగు పురస్కారం



కాకినాడ: ఆయన తెలుగు భాషల్లో దిట్ట.మంచి కవి, వక్త, రచయిత.ఆశు కవిత్వం చెప్పడంలో జాతీయ గుర్తింపు పొందిన ప్రముఖుడు. వృత్తి జిల్లా పరిషత్ లో ఉద్యోగం. ప్రవృత్తి తెలుగు భాష ఔన్నత్యాన్ని పెంచడం.జాతీయ భాషా దినోత్సవం సందర్భంగా పురస్కారాన్ని అందుకున్న ఆయనను జడ్పీ అధికారులు, ఉద్యోగులు అభినందించారు. కాకినాడ జిల్లా పరిషత్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా తోపెల్ల బాలసుబ్రహ్మణ్య శర్మ పనిచేస్తున్నారు. తెలుగు భాషపై ఆయనకు ఎనలేని మక్కువ. విధి నిర్వహణ పూర్తయిన అనంతరం తెలుగు కవులతో సమ్మేళనాలు, సమావేశాలు నిర్వహిస్తారు. వందలాది పద్యాలను రచించారు. ఆశు కవిత్వంలో అందవేసిన చేయి. కాగా హైదరాబాదుకు చెందిన గిడుగు రామ్మూర్తి పంతులు ఫౌండేషన్ గురువారం తెలుగు భాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన పలువురు ప్రముఖులను సత్కరించింది. కళా, సాహితీ, సేవారంగాలలో ప్రతిభ కనబరిచిన వారిని ఎంపిక చేసి ఈ సత్కారాలను నిర్వహించారు. ఫౌండేషన్ చైర్మన్ కాంతి కృష్ణ ఆధ్వర్యంలో ప్రముఖ కవి, సాహితీ విమర్శకులు డాక్టర్ బిక్కి కృష్ణ ,ఏపీ సాహిత్య అకాడమీ చైర్మన్, పద్మశ్రీ ఆచార్య కొనకలూరి ఇనాక్ లతోపాటు పలువురు హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తులు, తెలుగు పండితులు హైదరాబాదులోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. తొలుత తెలుగు భాష ప్రాముఖ్యం .ప్రాభవం పై కవి సమ్మేళనాన్ని నిర్వహించారు. ఇక జిల్లా నుంచి తెలుగుభాషాభివృద్ధికి విశేషంగా కృషి చేస్తున్న బాలసుబ్రహ్మణ్య శర్మ ను ఘనంగా సత్కరించారు.అంతకు ముందు జరిగిన కవి సమ్మేళనంలో ఆయన తన ప్రతిభ చాటారు. జిల్లా నుంచి ఎంపికైన ఏకైక తెలుగు కవి, రచయిత ఆయన. ఎందరో ప్రముఖులు కళా, సాహితీ, రంగంలో శర్మ చేస్తున్న సేవలను కొనియాడారు. శర్మ దంపతులను సత్కరించారు.తెలుగు రాష్ట్రాల్లో ఉత్తమ రచయితగా, తెలుగు భాషాభిమానిగా, కవి, రచయితగా తెలుగు కు వైభవం తెచ్చేందుకు పాటుపడుతూ పురస్కారాన్ని పొందిన శర్మను జిల్లా పరిషత్ అధికారులు, సిబ్బంది అభినందించారు. గతంలో సాహితీ బంధు బిరుదును ఆయన పొందారు. వందకు పైగా కవి సమ్మేళనంలలో పాల్గొన్నారు.పలు పుస్తకాలు రచించారు.

# పెద్దాపురప్పాడు క్రీడాకారులకు కలెక్టర్ అభినందన



కాకినాడ రూరల్: జాతీయ క్రీడాదినోత్సం పురస్కరించుకొని కాకినాడ క్రీడా మైదానంలో జరిగిన క్రీడా దినోత్సవ కార్యక్రమంలో జాతీయ,అంతర్జాతీయ స్థాయిలో పథకాలు సాధించిన క్రీడాకారులను జిల్లా కలెక్టర్ డి మురళీధర్ రెడ్డి అభినందించారు.ఈ మేరకు కరప మండలం పెద్దాపురప్పాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడాకారులు 2018-19లో తిరుపతిలో జరిగిన జాతీయజూనియర్ సాఫ్‌బాల్ పోటీలలో వెండి పథకం సాధించిన ధనశ్రీ,36వ జాతీయ జూనియర్ సాఫ్‌బాల్ నిజామాబాద్‌లో జరిగిన పోటీలలో సిల్వర్ పథకం సాధించిన పెద్ది రెడ్ల సాయి సింధూజా,అంతర్జాతీయ సాఫ్ట్‌బాల్ 0-12 సింగపూర్‌లో జరిగిన ఆసియా కప్‌కు భారత దేశం తరుపున ప్రాతినిధ్యం వహించిన పుద్దాపురప్పాడు క్రీడాకారుడు కొత్తపల్లి అజయ్ కుమార్‌లను , క్రీడాకారులకు శిక్షణ నిచ్చినవ్యాయాము పాధ్యాయుడు బివివిఎస్‌వి.ప్రసాద్‌ను జిల్లా కలెకటర్‌డి.మురళీధర్ రెడ్డి కాకినాడ పార్లమెంటు సభ్యురాలు వంగా గీతా విశ్వనాధ్, మేయర్ సుంకర పావని ,జిల్లా ఎస్పీ నయీం అస్మీ అభినందించారు.

# నెట్ బాల్ పోటిల్లో సన్ స్కూల్ విద్యార్థుల ప్రతిభ



భీమునిపట్నం: జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా (డి.ఎస్.ఏ) జిల్లా స్పోర్ట్సుఅథారిటి ఆద్వర్యంలో నిర్వహించిన నెట్ బాల్ పోటిల్లో కిటిన్ పేట లో ఉన్న సన్ స్కూల్ కు బాలురు విభాగంలో మొదటి స్థానం ,బాలికల విభాగంలో మూడవస్థానం లో నిలిచారని సన్ స్కూల్ కరస్పాండెంట్ కైతపల్లి. శ్రీనువాసరావు తెలిపారు.వీరికి ఈనెల 29న ఆంధ్రా యూనివర్శిటీ లో జీవిఎంసి కమిషనర్ సృజన బహుమతులు అందజేసారని తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ విద్యార్థులందరికీ నెట్ బాల్ మరింత శిక్షణ ఇవ్వాలని వ్యాయామ ఉపాధ్యాయులకు తెలియజేశారు. గెలుపపొందిన విద్యార్థిని విద్యార్థులను అభినందించారు.

## హోంగార్డు కుటుంబ సభ్యులను పరామర్శించిన ముత్తంశెట్టి.మహేష్

భీమునిపట్నం: గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో చిట్టివలస కొండపేటకు చెందిన భీమిలి హోంగార్డు ధనుంజయ్ కుమార్ దుర్మరణం చెందారు. ఈ సంగతి తెలుసుకున్న భీమిలి నియోజకవర్గ ఇన్ చార్జ్ ముత్తంశెట్టి.మహేష్ భీమిలి ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి మృతదేహాన్ని సందర్శించి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

## ఎస్సీ కార్పోరేషన్‌ను విభజించడం హర్షనీయం : రాష్ట్ర మాల ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు రాజశేఖర్

కాకినాడ: రాష్ట్రంలో ఉన్న ఎస్సీ కార్పోరేషన్‌లను మాల,మాదిగ,రెల్లి మూడు విభాగాలకు ప్రభుత్వం ప్రత్యేక కార్పోరేషన్లు ఏర్పాటు చేయడం హర్షణీయమని రాష్ట్ర మాల ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు నక్కా రాజశేఖర్ పేర్కొన్నారు.గురువారం స్థానిక శాంతిభవన్‌లో ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ ఎస్సీ కార్పోరేషన్‌ను3విభాగాలుగా విడదీయడాన్ని కొంత మంది రాద్దాంతం చేస్తూ దానిని ఎస్సీవర్గీకరణచేయడంగా పేర్కొనడాన్ని ఆయన ఖడించారు.రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్ మోహనరెడ్డి కులాల పరంగా ప్రత్యేక కార్పోరేషన్లు ఏర్పాటు చేయడం కేవలం అన్ని జాతుల వారికి సంక్షేమ ఫలాలు అందించాలనే దృఢసంకల్పం మాత్రమేనన్నారు.గత తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో కార్పోరేషన్ రుణాలు పొందిన అభ్యర్థుల జాబితాలపై శ్వేత పత్రం ఇవ్వాలని గతంలో అవినీతి కుంబకోణాలు జరిగాయన్నారు. నిజమైన లబ్ధిదారులు ఇంకాఎస్సీ కార్పోరేషన్ చుట్టూ తిరుగుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేసారు.తెదేపాలో ఉన్న మాల నాయకులు తప్పుడు ప్రకటనలు చేసి సీఎంను విమర్శించాలని చూస్తే సహించేదిలేదన్నారు.గత ప్రభుత్వంలో చేసిన నేరాల చిట్టా బయట పెడతామని రాజశేఖర్ హెచ్చరించారు. ఈ సమావేశంలో మాల మహానాడు నాయకులు నేతల జాన్‌బాబు,డి.ధర్మ,వి.రాజయేల్,ప్రభాకర్, సాల్మన్,పద్మ, రమాదేవి,కుమారి,లక్షణ్ తదితరులు పాల్గొన్నారు.

# పర్యావరణ పరిరక్షణకు మట్టి వినాయక ప్రతిమలనే పూజించండి



మధురవాడ : మహా విశాఖ 4వ వార్డు పరిధి జాతర శిల్పారామంలో శుక్రవారం ఉత్తరాంధ్ర ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్ట్ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో మట్టి విగ్రహాలు పంపిణీ కార్యక్రమంలో జిల్లా మంత్రి అవంతి శ్రీనివాస్ ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రక ృతి హితమైన మట్టి గణపతి విగ్రహాలను పూజించడం ప్రతి ఒక్కరు బాధ్యతగా తీసుకోవాలన్నారు. ప్రక ృతి సమతుల్యతను కాపాడటంలో ప్రతి ఒక్కరు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో విశాఖ ఎం.పి ఎంవివి సత్యనారాయణ, స్వాతి ప్రొమోటర్స్ మేనేజింగ్ డైరెక్టర్ రమేష్ రెడ్డ్ మరియు ఉత్తరాంధ్ర ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్ట్ అసోసియేషన్ అధ్యక్షులు పి.ఈశ్వర్ చౌదరి, ప్రధాన కార్యదర్శి ఎం.శ్రీరామ్ రెడ్డి, కోశాధికారి బి.జార్జి ఇతర సభ్యులు పాల్గొన్నారు.

## అందుకే తెదేపా రాద్ధాంతం చేస్తోంది : బొత్స



విజయనగరం: ఇసుకపై సంపాదన పోతుందనే ఆందోళనతోనే తెదేపా అనవసర రాద్ధాంతం చేస్తోం దంటూ రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ అన్నారు. ఇసుక కొరతపై రాష్ట్ర వ్యాప్తంగా తెదేపా చేపట్టిన నిరసన కార్యక్రమాలపై బొత్స స్పందిస్తూ ఈ వ్యాఖ్యలు చేశారు. విజయనగరం జిల్లా ప్రగతిపై నిర్వహించిన అధికారుల సమీక్ష సమావేశంలో పాల్గొన్న బొత్స మీడియాతో మాట్లాడారు. గత ఐదేళ్ళుగా తెదేపా నేతలకు ఇసుక ప్రధాన ఆదాయ వనరుగా ఉండేదని.. ఇప్పుడు ప్రభుత్వం కొత్త విధానం తీసుకొస్తుండటంతో వారికి సంపాదన పోతుందనే భయం పట్టుకుందన్నారు. అందుకే నిరసనలు, ఆందోళనలు చేస్తున్నారని విమర్శించారు.

ఏదైనా కొత్త విధానాన్ని రూపొందించి అమలు చేసేందుకు కొంత సమయం పడుతుందన్న మంత్రి.. ఇసుకపై తీసుకొచ్చిన నూతన విధానం అమలకు కూడా సమయం పడుతుందని వివరించారు.

కొన్నాళ్లు ఇబ్బందులు ఉంటాయని ప్రభుత్వం ముందే చెప్పిందని స్పష్టం చేశారు. ఆ విషయాన్ని ప్రజలు అర్థం చేసు కున్నారని.. తెదేపా మాత్రం అనవసర రాద్ధాంతం చేస్తోందంటూ బొత్స ధ్వజమెత్తారు.

# గీతం వర్సిటీకి ఎఐసిటిఇ అవార్డు

### అత్యధిక ఇంటర్న్‌షిప్‌లు సాధించిన విద్యాసంస్థగా గుర్తింపు




సాగర్‌నగర్ : ఇంజనీరింగ్ విద్యార్థులలో అత్యధిక శాతం మందికి ప్రముఖ పరిశ్రమలలో ఇంటర్న్‌షిప్ సాధించిన ఆంధ్రప్రదేశ్‌లోని ఏకైక విద్యాసంస్థగా గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం గీతం ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీని గుర్తిస్తూ అఖిలభారత సాంకేతిక విద్యా మండలి (ఎఐసిటిఇ) అవార్డును ప్రకటించింది. దేశం మొత్తం మీద గీతంకు 17వ ర్యాంకు లభించగా దక్షిణ భారతదేశంలో 6వ ర్యాంకు సాధించింది. న్యూఢిల్లీలోని ఎఐసిటిఇ ప్రధాన కార్యాలయంలో ఇటీవల నిర్వహించిన జాతీయ ఇంటర్న్‌షిప్ దినోత్సవంలో ఎఐసిటిఇ ఛైర్మన్ డాక్టర్ అనిల్ డి సహస్రాబ్దు చేతుల మీదుగా గీతం ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ అధికారి కమాండర్ గురుమూర్తి గంగాధరన్ ఈ అవార్డును అందుకున్నారు. ఇంటర్న్‌షిప్‌లు, ప్రాంగణ నియామకాలలో ఆంధ్రప్రదేశ్‌లో గీతం ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఆదర్శంగా నిలిచిందని ప్రశంసించారు. కార్యక్రమంలో ఎఐసిటిఇ వైస్ ఛైర్మన్ డాక్టర్ ఎమ్.పి.పూనియా, డిప్యూటీ డైరెక్టర్ ప్రొఫెసర్ రాజీవ్‌కుమార్, ఇంటర్న్‌శాల వ్యవస్థాపకుడు డాక్టర్ నీతుభగత్, 400 మందికి పైగా వివిధ కళాశాలల ప్లేస్‌మెంట్ అధికారులు పాల్గొన్నారు.

దేశం మొత్తంమీద ఈ అరుదైన గుర్తింపు లభించడం పట్ల గీతం ట్రైనింగ్, ప్లేస్‌మెంట్ విభాగాన్ని వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ కె.శివరామకృష్ణ, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ కె.వి.జి.డి. బాలాజీ అభినందించారు.

# ప్రభుత్వ పథకాలపై దుష్ప్రచారం తగదు

### పర్యాటక యువజన సర్వీసుల మంత్రి ఎం. శ్రీనివాసరావు



విశాఖపట్నం : తమ ప్రభుత్వం అభివృద్ధికి వ్యతిరేకం కాదని అవినీతికి వ్యతిరేకమని రాష్ట్ర పర్యాటక క్రీడలు యువజన సర్వీసుల శాఖ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు పేర్కొన్నారు. శుక్రవారం సర్క్యూట్ హౌస్ లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ అభివృద్ధి పథకాల పైన ముఖ్యంగా ఇసుక పాలసీ పై దుష్ప్రచారం చేయడం తగదన్నారు. పార్టీకి కులాలకు రాజకీయాలకు అతీతంగా అభివృద్ధే లక్ష్యంగా ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పరిపాలన సాగుతుందన్నారు. దశలవారీగా మద్యపాన నిషేధం అమ్మ వడి మత్స్యకారులకు వృత్తిపనివారు లకు ఆటో డ్రైవర్లకు చేనేత కార్మికులకు లబ్ధి చేకూర్చే ఎన్నో పథకాలను పెడుతున్నట్లు తెలిపారు. ఎవ్వరు ఎన్నడూ ఊహించని విధంగా నాలుగు లక్షల ఉద్యోగాలను కల్పిస్తుందని వెల్లడించారు. నియామకాలు పారదర్శకంగా నిష్పక్షపాతంగా జరుగుతాయని దళారుల మాటలు నమ్మవద్దని చెప్పారు. తమ ప్రభుత్వం వాస్తవ అభివృద్ధిని మాత్రమే చేస్తున్నదని చెప్పిందే చేస్తుందని ప్రజలను భ్రమలలో ఉంచడం తమకు చేత కాదన్నారు. వి ఎం ఆర్ డి ఏ అధ్యక్షులు ద్రోణంరాజు శ్రీనివాస్ మాట్లాడుతూ ఉపయోగకరమైన అభివృద్ధి సంక్షేమ పథకాలను జగన్మోహన్ రెడ్డి అమలు చేస్తున్నారని వివరించారు.

#### ఇసుక కొరత లేకుండా చర్యలు: జిల్లా కలెక్టర్

సమావేశంలో పాల్గొన్న జిల్లా కలెక్టరు వినయ్ చంద్ మాట్లాడుతూ జిల్లాలో ఇసుక కొరత లేకుండా చేసేందుకు అన్ని చర్యలు చేపట్టామన్నారు. తూర్పుగోదావరి శ్రీకాకుళం జిల్లాల్లో ఇసుక రీచ్ లను గుర్తించడం జరిగిందని జిల్లాలో 2 స్టాక్ యార్డ్ లను ముడసర్లోవ మర్రిపాలెం లలో ఏర్పాటు చేశామని తెలిపారు. నౌకాదళ ఇంజనీరింగ్ పనులకు రియల్ ఎస్టేట్ కాంట్రాక్టర్లకు ప్రభుత్వ కాంట్రాక్టర్లకు టోకున ఇసుక కొనుగోలుకు అనుమతులు ఇవ్వడం జరుగుతుందని వారు ఇసుక రీచ్ల నుండి నేరుగా ఇసుక తీసుకు వెళుతున్నట్లు చెప్పారు. జిల్లాకు సంవత్సరానికి 12 లక్షల క్యూబిక్ మీటర్ల ఇసుక అవసరం అవుతుంది అన్నారు. రిటైల్ యార్డులలో నిన్నటి వరకు 379 యూనిట్ల ఇసుక వచ్చిందని, 80 యూనిట్లు వినియోగదారులు తీసుకుని వెళ్లగా 299 యూనిట్ల ఇసుక ఉన్నదని తెలియజేశారు. ఈ సమావేశంలో గాజువాక శాసనసభ్యులు తిప్పల నాగిరెడ్డి, వంశీకృష్ణ యాదవ్, అక్కరమాని విజయనిర్మల తదితరులు పాల్గొన్నారు.

# ఏపీకి 152 .. టీఎస్‌కు 59 టీఎంసీలు



హైదరాబాద్: ఆంధ్రప్రదేశ్, తెలంగాణకు నీటి విడుదలకు సంబంధించి కృష్ణానది యాజమాన్య బోర్డు ఉత్తర్వులు జారీ చేసింది. సెప్టెంబరు వరకు ఏపీకి 152 టీఎంసీలు, తెలంగాణకు 59 టీఎంసీలు, కనీస నీటి వినియోగ మట్టానికి పైనున్న 257.54 టీఎంసీలు ఇరు రాష్ట్రాలకు కేటాయిస్తూ ఉత్తర్వులిచ్చింది. ఏపీకి: శ్రీశైలం నుంచి 100 టీఎంసీలు, సాగర్ నుంచి 52 టీఎంసీలు, చెన్నైకు తాగునీరు సహా పోతిరెడ్డిపాడు నుంచి 88 టీఎంసీలు, హంద్రీ నీవా, ముచ్చుమర్రి ఎత్తిపోతల పథకాల నుంచి 12 టీఎంసీలు, సాగర్ కుడికాలువ ద్వారా 32 టీఎంసీలు, ఎడమ కాల్వ ద్వారా 2 టీఎంసీలు, కృష్ణా డెల్టాకు 15 టీఎంసీల విడుదలకు బోర్డు ఆదేశాలు ఇచ్చింది.

తెలంగాణకు: శ్రీశైలం నుంచి 14.5 టీఎంసీలు, సాగర్ నుంచి 44.51 టీఎంసీలు, కల్వకుర్తి ఎత్తిపోతల ద్వారా తాగు, సాగునీటి అవసరాలకు 14.5 టీఎంసీలు, సాగర్ ఎడమ కాలువ నుంచి 26.06, ఏఎమ్మార్పీ నుంచి 10.47 టీఎంసీలు, హైదరాబాద్ తాగునీటికి 5.9 టీఎంసీలు, మిషన్ భగీరథకు 2.08 టీఎంసీలు కృష్ణా నదీ యాజమాన్య బోర్డు కేటాయించింది.

# శ్రీవారిని దర్శించుకున్న పీవీ సింధు

తిరుమల: తిరుమల శ్రీవారిని పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. కేంద్ర మంత్రి రవిశంకర్ ప్రసాద్, స్టార్ షట్లర్ పీవీ సింధు, ఐపీఎల్ ఛైర్మన్ రాజీవ్‌శుక్లా శ్రీవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పీవీ సింధు తన తల్లిదండ్రులతో కలిసి అభిషేక సేవలో పాల్గొన్నారు. ఆమెకు రంగనాయకుల మండపంలో వేదపండితులు ఆశీర్వచనాలు అందించారు.



# ట్రాఫిక్ రూల్స్ అతిక్రమిస్తే ఇక కష్టకాలమే !

హైదరాబాద్: ట్రాఫిక్ నిబంధనలను అతిక్రమించిన వాహనదారులకు ఇక కష్టకాలమే. సెప్టెంబరు 1 నుంచి నిబంధనలు అతిక్రమించిన వాహనదారులపై భారీగా అపరాధ రుసుము విధించే నిబంధనలను అమలులోకి తీసుకువస్తూ కేంద్ర రవాణా, జాతీయ రహదారుల మంత్రిత్వ శాఖ గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ నిబంధనలు వచ్చే నెల 1 నుంచి అమలులోకి రానున్నట్లు దాటితే గీత.. భారీ వాత శీర్షికన ఈ నెల 22 న ఈనాడులో కథనం వెలువడిన విషయం తెలిసిందే. అప్పటికి కేంద్రం గెజిట్ నోటిఫికేషన్ జారీ చేయలేదు.

దీన్ని వచ్చే నెల 1 నుంచి అమలులోకి తీసుకొస్తున్నట్లు తాజాగా గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది. కేంద్రం ఉత్తర్వులను అమలు చేస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం మరో ఉత్తర్వును జారీ చేయాల్సి ఉంది. ఆ మేరకు రవాణా శాఖ గురువారం రాష్ట్ర ప్రభుత్వానికి దస్త్రాన్ని పంపింది.



# ర్యాగింగ్ చట్టాలు కఠినంగా ఉన్నాయి

- విద్యార్థుల వైఖరులు సరిగా లేకపోతే కష్టాలు తప్పవు
- మిమ్మల్ని రక్షిస్తాం...తప్పుచేస్తే శిక్షిస్తాం
- ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదు
- వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డి




ఆంధ్రవిశ్వవిద్యాలయం : ఆంధ్రవిశ్వవిద్యాలయంలో ప్రతీ విద్యార్థికి బధ్రత కల్పిస్తూ, నాణ్యమైన విద్యను అందించే దిశగా ఏయూ పనిచేస్తుందని, అదే సమయంలో విద్యార్థులు తప్పుచేస్తే తగిన విధంగా శిక్షిస్తామని ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డి స్పష్టం చేశారు. శుక్రవారం ఉదయం ఏయూ ఇంజనీరింగ్ కళాశాల వైవిఎస్ మూర్తి ఆడిటోరియంలో నిర్వహించిన ర్యాగింగ్ నిషేధంపై విద్యార్థుల అవగాహన సదస్సులో ఆయన పాల్గొని ప్రసంగించారు. ర్యాగింగ్ చట్టాలు చాలా కఠినంగా ఉన్నాయని, ర్యాగింగ్‌కు పాల్పడి విలువైన భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని హితవు పలికారు. ర్యాగింగ్‌కు పాల్పడిన వారు ఎంతటి వారయినే ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. విద్యార్థులు ర్యాగింగ్‌కు దూరంగా ఉండాలని సూచించారు. ర్యాగింగ్ నిశేధంపై మెదటి సంవత్సరం విద్యార్థులకు సైతం అవగాహన కల్పించాలని సూచించారు. తనకు ప్రతీ విద్యార్థి ప్రత్యేకమని, ప్రతీ విద్యార్థి సమానమేనన్నారు. విద్యార్థుల సమస్యలను 48 గంటల్లో పరిష్కరిస్తామన్నారు. విద్యార్థులు మంచి నడవడికను కలిగి ఉండాలన్నారు. విద్యార్థి ఉపయోగించే సెల్‌ఫోన్, సెల్‌ఫోన్‌ను వినియోగించే విధానం, అతని ప్రవర్తన, వ్యక్తిత్వాలను తెలియజేస్తున్నాయన్నారు.

రానున్న కాలంలో విశాఖ నగరం ఐటి రంగానికి కేంద్రంగా నిలుస్తుందన్నారు. రాష్ట్రానికి విశాఖ ఆర్ధిక రాజధానిగా నిలుస్తుందని, దీనికి విద్యార్థులే కీలకమన్నారు. విద్యార్థులు నాలుగు సంవత్సరాలు ప్రణాళికా బద్ధంగా చదువుకుంటూ జ్ఞానాన్ని సమకూర్చుకుంటేనే భవిష్యత్ జీవితం ఎంతో బాగుంటుందన్నారు.

ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య పేరి శ్రీనివాస రావు మాట్లాడుతూ ర్యాగింగ్ పర్యవసానాలను తెలియజేస్తూ, అధికారుల ఫోన్ నంబర్లతో విభాగాలు, హాస్టల్స్‌లో పోస్టర్లను ఏర్పాటు చేసామన్నారు. ర్యాగింగ్ రహితంగా ఏయూను నిలుపుతున్నామన్నారు. విద్యార్థులు మంచి నడవడికతో సాగాలన్నారు. డిసిపి ఎస్.రంగారెడ్డి మాట్లాడుతూ విలువలను విస్మరిస్తూ, పాశ్యాత్య సంస్కృతిని ఆపాదించుకోవడం సరికాదన్నారు. జూనియర్ విద్యార్థులను మానసికంగా, శారీరకంగా, లైంగికంగా వేధింకడం ర్యాగింగ్ పరిధిలోనికి వస్తుందన్నారు. ర్యాగింగ్‌కు పాల్పడితే వర్సిటీలో ప్రవేశం రద్దుచ చేసే అవకాశం ఉందన్నారు. సాంకేతికతను యువత సద్వినియోగం చేసుకోవాలని, దుర్వినియోగం చేయరాదన్నారు. పోలీసులు సేవలు నిరంతరం అందుబాటులో ఉంటాయని ప్రత్యక్షంగా చూపించారు. 100 నంబరుకు విద్యార్థులతో ఫోన్ చేయించి కేవలం 3నిమిషాల వ్యవధిలో పోలీసులు అక్కడకు చేరుకోవడం విద్యార్థులు గమనించారు. పోలీసు వ్యవస్థ ప్రజల సమస్యలపై ఎంత వేగంగా స్పందిస్తుందనే విషయాన్ని విద్యార్థులకు ప్రత్యక్షంగా చూపారు. విద్యార్థులకు విలువలు, క్రమశిక్షణ ఆభరణాలుగా నిలుస్తాయన్నారు. వ్యవస్థమీద గౌరవం కలిగి ఉండాలని సూచించారు. విద్యార్థుల రక్షణ బాధ్యత పోలీసులదని, అదే సమయంలో విద్యార్థులు తప్పులు చేసి తమ జీవితాన్ని నాశనం చేసుకోవద్దని పలు ఉదాహరణలతో వివరించారు. న్యాయవాది కె.మురళీధర్ మాట్లాడుతూ చట్ట పరిధిలో ర్యాగింగ్ నిశేధించబడిందని, తప్పుచేస్తే చట్టం క్షమించదనే విషయం విద్యార్థులు గుర్తెరిగి నడచుకోవాలని సూచించారు. ర్యాగింగ్‌కు పాల్పడాలనే ఆలోచనలను ముందుగా విద్యార్థులు తమ మనసునుంచి దూరం చేయాలన్నారు. సిటిజన్ ఫోర్స్ నిర్వాహకులు రమేష్ బాబు మాట్లాడుతూ విద్యార్థులు మంచి నడవడిక కలిగి ఉండాలన్నారు. సీనియర్ పాత్రికేయులు యుగంధర్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల ప్రవర్తన వర్సిటీ ప్రతిష్టను ప్రభావితం చేస్తుందన్నారు. ది హిందూ విశాఖ బ్యూరో చీఫ్ సుమిత్ భట్టాచార్య ఏసిపి కులశేఖర్, సిఐ కె. రామా రావు, వైస్ ప్రిన్సిపాల్ ఆచార్య సి.హెచ్ రత్నం తదితరులు ప్రసంగించారు. కార్యక్రమంలో పూర్వ ప్రిన్సిపాల్ పి.ఎస్ అవధాని విభాగాధిపతులు, ఆచార్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.




VIJAYABHANU - Visakhapatnam
Editor : B. Chandra Sekhar, Printed and Published by him on behalf of VIJAYABHANU PUBLICATIONS PVT. LTD., Published and Printed at VIJAYABHANU PRESS, D.No. 9-3-17, Pithapuram Colony, Visakhapatnam - 530 003.
R.N.I. No. 32157/77. Postal Regd. No. J/VM-RNP/32 ☆ Phone : 2564353, Fax : 0891-2569004 ☆ e-mail: vijayabhanudaily@gmail.com